teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151
# తీన్మార్
నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక
ములుగు | సంపుటి: 04 | సంచిక: 280 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | పేజీలు : 8 | గురువారం 16 ఏప్రిల్ 2026 | వెల : 5-00
Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad

## నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం ప్రకటన

- సీట్ల సంఖ్యలో 50 శాతం పెంపు
- 2011 జనాభా లెక్కల ప్రచారంపై స్పష్టత
- కేవలం జనాభా ప్రాతిపదికనే కాదని వెల్లడి
- సోషల్ మీడియా అపోహలను నమ్మవద్దు



2

## మైక్రో ఫైనాన్స్ కేసులో కీలక మలుపు



- అప్రూవర్‌గా మారిన నిందితుడు మధు
- కన్నీటి పర్యంతమైన సింగర్ మంగ్లీ
- సింగర్ మంగ్లీకి ఆ కేసుతో సంబంధం లేదు
- మీడియా సాక్షిగా మధు స్పష్టత

2



## కాళేశ్వరంలో భారీ బహిరంగ సభ

- ఈనెల 20న ముఖ్యమంత్రి కాళేశ్వరం పర్యటన
- మేడిగడ్డ బ్యారేజీ పియర్లను పరిశీలించనున్న సీఎం



## మార్కెట్ యార్డ్‌ల ఆధునీకరణపై మంత్రి తుమ్మల సమీక్ష



# మీసేవ కేంద్రాలపై ఏసీబీ పంజా

- హైదరాబాద్‌లో ఏకకాలంలో ఆకస్మిక దాడులు
- మీసేవలో దళారుల రాజ్యం
- సామాన్యులకు ఇబ్బందులను గుర్తించిన ఏసీబీ
- సర్టిఫికెట్ల జారీలో అదనపు వసూళ్లు
- పక్కా సమాచారంతో రంగంలోకి ఏసీబీ



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (తీన్మార్ న్యూస్)**

మీసేవ కేంద్రాల్లో జరుగుతున్న అక్రమాలపై అవినీతి నిరోధక శాఖ కొరడా ఝుళిపించింది. బుధవారం హైదరాబాద్ లోని పలు కీలక ప్రాంతాల్లోని మీసేవ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నగరంలోని ఖైరతాబాద్, అంబర్‌పేట్, అల్వాల్ ప్రాంతాల్లోని మీసేవ కేంద్రాల్లో అధికారులు సోదాలు నిర్వహించారు. పౌర సేవా సర్టిఫికెట్లు జారీలో పెద్ద ఎత్తున - మిగతా 2లో

## రేవంత్ రెడ్డి ఒక హైబ్రిడ్ ముఖ్యమంత్రి



- జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపును అంగీకరించం
- దక్షిణాది ప్రాతినిధ్యంపై కేటీఆర్ వర్సెస్ రేవంత్ రెడ్డి

2

### డీప్‌ఫేక్ కంటెంట్‌పై గుజరాత్ హైకోర్టు
# సీరియస్

- సోషల్ మీడియా దిగ్గజాలకు కోర్టు షాక్
- మే 8 లోగా వివరణ ఇవ్వాలని ఆదేశం
- గూగుల్, మెటా, ఎక్స్ సంస్థలకు నోటీసులు



**తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 15 (ఏప్రిల్ 15 (తీన్మార్ న్యూస్)**

లడీప్‌ఫేక్ కంటెంట్‌ను అరికట్టేందుకు గుజరాత్ హైకోర్టు కఠినంగా వ్యవహరించాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో సృష్టించే ఫేక్ వీడియోలు, ఫోటోల వల్ల ప్రజా శాంతికి భంగం కలుగుతోందని దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై కోర్టు స్పందించింది. అయితే, ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని కోరుతూ గూగుల్, మెటా, - మిగతా 2లో

## రైతుల పొట్టకొట్టి పరిశ్రమలు కడతారా?

- రణరంగంగా మారిన భూసేకరణ పోరాటం
- వికారాబాద్‌లో కల్వకుంట్ల కవిత అరెస్ట్

**వికారాబాద్, ఏప్రిల్ 15 (తీన్మార్ న్యూస్):**

వికారాబాద్ జిల్లాలో ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో భూసేకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న రైతుల పోరాటం ఉగ్రరూపం దాల్చింది. పోలీసులు, రైతులకు మధ్య జరిగిన తోపులాటతో పరిస్థితి ఒక్కసారిగా రణరంగంగా మారింది. దీంతో రైతులకు మద్దతుగా పరిగి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నాకు దిగిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. పరిగి ప్రాంతంలో పరిశ్రమల స్థాపన - మిగతా 2లో



## సీఎంతో మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్ కీలక భేటీ

- తెలంగాణకు నష్టం జరగకుండా హైబ్రిడ్ మోడల్‌పై చర్చ
- నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ వేగవంతం
- కష్టపడిన కార్యకర్తలకు ప్రాధాన్యత



**హైదరాబాద్, ఏప్రిల్ 15 (తీన్మార్ న్యూస్):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బుధవారం ఉదయం సమావేశమయ్యారు. మధ్యాహ్నం వరకూ ఈ భేటీ కొనసాగగా ప్రధానంగా నామినేటెడ్ పదవుల భర్తీ, నియోజకవర్గాల పునర్విభజన, పార్టీ అంతర్గత వ్యవహారాలపై కీలకంగా చర్చించినట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన వల్ల తెలంగాణ వంటి దక్షిణాది రాష్ట్రాలకు రాజకీయంగా నష్టం కలిగే అవకాశం ఉందన్న అంశంపై ప్రధానంగా చర్చించారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్లను పెంచితే, అభివృద్ధి పథంలో ఉన్న తెలంగాణకు అన్యాయం జరుగుతుందని, దీనిపై పార్టీ పరంగా చేపట్టాల్సిన పోరాటాలు, ప్రజా క్షేత్రంలోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించినట్లు సమాచారం. - మిగతా 2లో

## సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాలు విడుదల

- వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ఫలితాలు

2





### తమిళనాడులో బీజేపీకి
# చోటు లేదు

- డీఎంకే-కాంగ్రెస్ కూటమిని గెలిపించండి
- రాహుల్ గాంధీ నాయకత్వమే దేశానికి శ్రీరామరక్ష
- విభజన రాజకీయాలు సాగవు: ఉత్తమ్

**తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 15 (తీన్మార్ న్యూస్):**

లౌకికవాదానికి తమిళనాడు పెట్టింది పేరని తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. తమిళనాడు ఎన్నికల పరిశీలకుడిగా నియమితులైన ఆయన గత మూడు రోజులుగా ఆ రాష్ట్రంలో విస్తృతంగా పర్యటిస్తూ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. బుధవారం కోయంబత్తూరు సమీపంలోని సింగనల్లూర్ నుండి కవుండంపాలెం వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించిన మంత్రి, అనంతరం శివకాశికి చేరుకుని అక్కడ జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. శివకాశి నుండి డీఎంకే బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జి. అశోకన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. "దేశంలో లౌకికవాదం కొనసాగాలంటే తమిళనాడు ఎన్నికలలో డీఎంకే-కాంగ్రెస్ కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. తమిళనాడులో విభజన రాజకీయాలకు చోటు లేదు. ఇక్కడ బీజేపీకి ప్రవేశం కూడా ఉండకూడదు అని మంత్రి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 21 పార్టీలతో ఏర్పడిన 'సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయెన్స్ ఢిల్లీ నుండి గ్రామీణ స్థాయి వరకు విజయవంతంగా కొనసాగుతోందని, భవిష్యత్ ప్రధానిగా రాహుల్ గాంధీ నాయకత్వం కోసం దేశ ప్రజలు ఎదురుచూస్తున్నారని ఆయన అన్నారు. మహిళా సాధికారతకు తమ కూటమి కట్టుబడి ఉందని తెలిపారు. సీఎం స్టాలిన్ పాలనను ప్రశంసిస్తూ తమిళనాడులో డీఎంకే-కాంగ్రెస్ కూటమి మళ్ళీ అధికారంలోకి వచ్చిన 300 రోజుల వ్యవధిలోనే 3 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. రాష్ట్ర పోలీసు శాఖలో అర్హులైన పదివేల మంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ప్రస్తుతం మహిళలకు అందిస్తున్న - మిగతా 2లో

## రేవంత్ రెడ్డి ఒక హైబ్రిడ్ ముఖ్యమంత్రి

హైదరాబాద్, ఏప్రిల్ 15 (తీన్మార్ న్యూస్):

పార్లమెంట్ లో దక్షిణాది ప్రాతినిధ్యాన్ని తగ్గిస్తే ఊరుకోబోమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహిళా రిజర్వేషన్లకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తోందని కానీ మహిళా బిల్లును డీలిమిటేషన్ తో ముడిపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన సీఎం రేవంత్ రెడ్డి ఒక హైబ్రిడ్ ముఖ్యమంత్రి అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి రాజకీయ వైఖరిలో స్థిరత్వం లేదని ఆయన ఉదయం కాంగ్రెస్ ప్రతినిధిగా, సాయంత్రం బీజేపీ నేతగా ఉంటారని ఆరోపించారు. హైబ్రిడ్ విధానం రేవంత్ రెడ్డి పాలనలో కూడా కనిపిస్తోందన్నారు. కేంద్రం పార్లమెంట్ లో ప్రవేశపెడుతున్న బిల్లులో అస్పష్టత ఉందన్నారు.

**సీఎం హైబ్రిడ్ మోడల్:**

కాగా నియోజకవర్గాల సంఖ్యను కేవలం జనాభా ఆధారంగా పెంచితే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి పరిష్కారంగా ఆయన హైబ్రిడ్ మోడల్ ను కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. 50 శాతం సీట్లు జనాభా ప్రాతిపదికన కేటాయించాలని మరో 50 శాతం సీట్లు ఆయా రాష్ట్రాల ఆర్థిక అభివృద్ధి ఆధారంగా కేటాయించాలని సూచించారు. దీని వల్ల జనాభా నియంత్రణ పాటించి, దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడిన దక్షిణాధి రాష్ట్రాలకూ న్యాయం జరుగుతుందని వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్పందించిన కేటీఆర్ రేవంత్ రెడ్డి ప్రతిపాదనపై పై విధంగా సెటైర్ వేశారు.

## సీఎంతో మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్ కీలక భేటీ

-మొదటిపేజీ తరువాయి

అలాగే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకుండా ఉండేందుకు సీఎం ప్రతిపాదించిన 'హైబ్రిడ్ మోడల్' పై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

**నామినేటెడ్ పదవుల భర్తీ**

చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఇరువురు నేతలు నిర్ణయించారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు, ఎన్నికల సమయంలో చురుగ్గా పనిచేసిన వారికి సముచిత స్థానం కల్పించాలని మీనాక్షి నటరాజన్ కోరారు. ఇప్పటికే పదవుల్లో ఉన్న కార్పొరేషన్ ఛైర్మన్ల పనితీరును బేరీజు వేసి, వారి పదవీకాలం పొడిగింపు లేదా కొత్త వారి నియామకంపై ప్రాథమికంగా ఒక అవగాహనకు వచ్చారు.

**వారంలో పీఏసీ సమావేశం**

రాష్ట్రంలో మారుతున్న రాజకీయ సమీకరణాలు, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడం, పార్టీ బలోపేతంపై చర్చించేందుకు వారంలోగా రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో కేబినెట్ విస్తరణ, జిల్లా స్థాయి కమిటీల నియామకంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం ప్రకటన

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 15 (తీన్మార్ న్యూస్):

దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతున్న నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకూ స్పష్టతనిచ్చింది. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల సంఖ్యలో 50 శాతం పెంపు ఉంటుందని కేంద్రం అధికారికంగా వెల్లడించింది. ఈ మేరకు బిల్లులో నిబంధనలను పొందుపరిచినట్లు సమాచార శాఖ స్పష్టం చేసింది. డీలిమిటేషన్ ప్రక్రియ కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరుగుతుందని గతకొన్ని రోజులుగా సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో జరుగుతున్న ప్రచారాన్ని కేంద్రం కొట్టిపారేసింది. అటువంటి వార్తల్లో నిజం లేదని, అపోహలను నమ్మవద్దని సూచించింది. జనాభా ప్రాతిపదికన మాత్రమే కాకుండా, భౌగోళిక విస్తీర్ణం, ఇతర శాస్త్రీయ అంశాలను పరిగణనలోకి తీసుకుని సీట్ల పెంపు ఉంటుందని కేంద్రం సంకేతాలిచ్చింది.

**50% పెంపు**

ప్రస్తుతమున్న సీట్ల సంఖ్యకు అదనంగా సగం సీట్లు పెరగనున్నాయి. దీనివల్ల పెద్ద రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలకు కూడా ప్రాతినిధ్యం పెరుగుతుంది. పునర్విభజన విధివిధానాలు బిల్లులో స్పష్టంగా ఉన్నాయని, చట్టపరమైన ప్రక్రియ ప్రకారమే ఇది జరుగుతుందని సమాచార శాఖ పేర్కొంది. ఈ అంశంపై పార్లమెంటులో జరిగే చర్చ సందర్భంగా పూర్తిస్థాయిలో క్లారిటీ ఇస్తామని, విపక్షాల సందేహాలను నివృత్తి చేస్తామని కేంద్రం ప్రకటించింది. నియోజకవర్గాల సంఖ్య 50 శాతం పెరగడం వల్ల దేశవ్యాప్తంగా రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాల సంఖ్య భారీగా పెరగనుంది.

## కాళేశ్వరంలో భారీ బహిరంగ సభ

హైదరాబాద్, ఏప్రిల్ 15 (తీన్మార్ న్యూస్):

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 20న కాళేశ్వర ప్రాజెక్టు పరిధిలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న మేడిగడ్డ బ్యారేజీ పరిస్థితిని ఆయన స్వయంగా పరిశీలించనున్నారు. గతంలో కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజీ పియర్లను సీఎం పరిశీలించి, పునరుద్ధరణ పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించనున్నారు. అదేవిధంగా కాళేశ్వరంలోని గోదావరి నది వద్ద జరగనున్న సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లపై సీఎం సమీక్ష నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించనున్నారు. పర్యటన ముగింపులో ముఖ్యమంత్రి అక్కడ ఏర్పాటు చేయనున్న భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగిస్తారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాజెక్టుల భవిష్యత్తుపై ఆయన కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేసేందుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఇప్పటికే రంగంలోకి దిగారు. జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు యంత్రాంగంతో కలిసి భద్రత, సభా ఏర్పాట్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటనలో ఎక్కడా లోపాలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

## మార్కెట్ యార్డ్‌ల ఆధునీకరణపై మంత్రి తుమ్మల సమీక్ష

**రూ. 568.50 కోట్లతో 630 అభివృద్ధి పనులు**

**వేగంగా పూర్తి చేయాలని ఆదేశం**

**జీరో బిజినెస్ ట్రేడర్లపై మంత్రి ఆగ్రహం**



హైదరాబాద్, ఏప్రిల్ 15 (తీన్మార్ న్యూస్):

తెలంగాణలో వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి, పారదర్శకతపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి పనుల పురోగతి, రైతులకు అందుతున్న సౌకర్యాలపై ఆయన అధికారులతో చర్చించారు. గత రెండు సంవత్సరాల్లో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయంతో 630 అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు మంత్రికి అధికారులు వెల్లడించారు. ఇందులో రూ.128 కోట్లతో 113 పనులు పూర్తయ్యాయని నివేదిక సమర్పించారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ప్రతి పనికి టైమ్‌లైన్ నిర్ణయించి వేగంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారం చేయకుండా లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి లైసెన్సులను రద్దు చేయాలని ఆదేశించారు. అలాంటి వారికి సహకరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పంట ఉత్పత్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు తుమ్మల. గడ్డిఅన్నారం మార్కెట్‌లో 'స్మార్ట్ మార్కెట్ యార్డ్' అమలు చేయాలని, డిజిటలైజేషన్ ద్వారా జీరో బిజినెస్ సమస్యను తగ్గించాలని నిర్ణయించారు. కోహెడ మార్కెట్ అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ ఖర్చు తగ్గింపుపైనా మంత్రి దృష్టి సారించారు. మార్కెట్ యార్డుల్లో సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేసి, జులై చివరి నాటికి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని అన్నారు. వ్యవసాయ కొనుగోళ్ల విషయానికి వస్తే ఖరీఫ్ సీజన్‌లో పత్తి కొనుగోళ్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లకు మిర్చి అధికంగా వస్తోందని పేర్కొన్నారు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. టార్పాలిన్లు, తేమ కొలమానాలు, డ్రైయర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోళ్లలోనూ రైతులకు పూర్తి రక్షణ కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అలాగే రైతుల ఖాతాలకు నేరుగా చెల్లింపులు చేస్తామని స్పష్టం చేశారు. మొత్తం మీద మార్కెట్ యార్డ్‌లను ఆధునీకరించి, రైతులకు అనుకూలంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల వెల్లడించారు.

## మీసేవ కేంద్రాలపై ఏసీబీ పంజా

-మొదటిపేజీ తరువాయి

అక్రమాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఈ దాడులు జరిగినట్లుగా తెలుస్తోంది.

**దళారు హవా.. అదనపు వసూళ్లు**

అయితే, సాధారణ ప్రజలకు అందాల్సిన సేవలను అడ్డుకుంటూ, మీసేవ సిబ్బంది దళారుల ద్వారా చక్రం తిప్పుతున్నట్లుగా ఏసీబీ ప్రాథమికంగా గుర్తించింది. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వం నిర్ణయించిన రుసుము కంటే ఎక్కువ మొత్తాన్ని వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దళారుల ద్వారా వచ్చే దరఖాస్తులను వెంటనే పరిష్కరిస్తూ ఇక నేరుగా వచ్చే సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లుగా తెలిసింది. సోదాల సమయంలో మీసేవ కార్యాలయాల్లోని నగదు నిల్వలు, దరఖాస్తుల పెండింగ్ జాబితా, సిబ్బంది వ్యక్తిగత వివరాలను ఏసీబీ బృందాలు పరిశీలించాయి. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆధారాలు లభిస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## డీప్‌ఫేక్ కంటెంట్‌పై గుజరాత్ హైకోర్టు సీరియస్

-మొదటిపేజీ తరువాయి

ఎక్స్, రెడ్డిట్ స్క్రిబ్డ్ వంటి సంస్థలకు కోర్టు నోటీసులు జారీ చేసింది. మే 8వ తేదీలోగా వీటిపై స్పందించాలని ఆదేశించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సహయోగ్ పోర్టల్‌లో ఈ సంస్థలన్నీ తప్పనిసరిగా భాగస్వాములు కావాలని కోర్టు సూచించింది. చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను నిర్ణీత కాలపరిమితిలోగా తొలగించేందుకు ఈ పోర్టల్ సమన్వయకర్తగా పనిచేస్తుంది. విచారణ సందర్భంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కీలక విషయాలను కోర్టు దృష్టికి తెచ్చింది. సోషల్ మీడియా సంస్థలు, ముఖ్యంగా ఎక్స్, ప్రభుత్వం పంపే నోటీసులకు సరిగ్గా స్పందించడం లేదని తెలిపింది. 2024 నుంచి 2026 మధ్య కాలంలో పంపిన 94 నోటీసులలో కేవలం 13 వాటికి మాత్రమే సమాధానం వచ్చిందని వెల్లడించింది. వికాస్ నాయర్ అనే వ్యక్తి దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో ప్రస్తుతం ఉన్న ఐటీ చట్టాలు ఏఐ టెక్నాలజీని నియంత్రించడానికి సరిపోవని పేర్కొన్నారు. డీప్‌ఫేక్ వీడియోల వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థకు, సామాజిక భద్రతకు ముప్పు పొంచి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

## సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాలు విడుదల

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 15 (తీన్మార్ న్యూస్):

శవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల ఎదురు చూస్తున్న సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాలు వచ్చేశాయి. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ 10వ తరగతి ఫలితాలు ఏప్రిల్ 15న ప్రకటించింది. సీబీఎస్ఈ 10వ తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు, తమ లాగిన్ వివరాలను ఉపయోగించి సీబీఎస్ ఈ అధికారిక వెబ్‌సైట్ లలో తమ ఫలితాలను పొందవచ్చు. సీబీఎస్ ఈ పదో తరగతి పరీక్షలు ఫిబ్రవరి 17నుంచి మార్చి 11 వరకు నిర్వహించారు. దేశవ్యాప్తంగా 25 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. ఈ ఏడాది బోర్డు పరీక్షలలో 10వ తరగతికి చెందిన దాదాపు 25 లక్షల మందితో సహా మొత్తం 43 లక్షలకు పైగా విద్యార్థులు పాల్గొన్నారు.ఈ ఏడాది నుంచి రెండు సార్లు పదో తరగతి పరీక్షలను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్ నిర్వహిస్తోంది.

## రైతుల పొట్టకొట్టి పరిశ్రమలు కడతారా..?

-మొదటిపేజీ తరువాయి

కోసం తమ సారవంతమైన భూములను లాక్కోవద్దంటూ రైతులు గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈ పోరాటానికి అండగా నిలిచిన కవిత, బుధవారం వందలాది మంది రైతులతో కలిసి ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అయితే, పోలీసులు భారీగా మోహరించి రైతులను అడ్డుకోవడంతో ఉద్రిక్తత మొదలైంది.

**ఎన్టీఆర్ చౌరస్తా వద్ద హైడ్రామా**

ధర్నా నిర్వహిస్తున్న కవితను పోలీసులు అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా, రైతులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య గంటల తరబడి తోపులాట జరిగింది. పరిస్థితి చేయి దాటిపోతుండటంతో పోలీసులు కవితను బలవంతంగా వాహనం నుంచి కిందకు దించి, ఎన్టీఆర్ చౌరస్తా మీదుగా తరలించారు. ఆమె వాహనాన్ని కూడా అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించినట్లు సమాచారం. అరెస్టుకు ముందు కవిత మాట్లాడుతూ రైతుల పొట్ట కొట్టి పరిశ్రమలు కట్టడం ఏంటని? ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతులు ప్రాణాలకు తెగించి తమ భూములను కాపాడుకుంటుంటే, వారిపై లాఠీచార్జ్ చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆపదని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం కవిత అరెస్టుతో వికారాబాద్‌లో ఉద్రిక్తత కొనసాగుతోంది. ఎక్కడికక్కడ జాగృతి శ్రేణులు రాస్తారోకోలు చేపట్టడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. శాంతిభద్రతల దృష్ట్యా జిల్లా కేంద్రంలో అదనపు పోలీసు బలగాలను మోహరించారు.

## తమిళనాడులో బీజేపీకి చోటు లేదు

-మొదటిపేజీ తరువాయి

రూ. 1000 ఆర్థిక సహాయాన్ని రూ. 2000కి పెంచి ప్రతి నెలా అందిస్తామని ప్రకటించారు. ప్రజల స్పందన చూస్తుంటే ముఖ్యమంత్రిగా మరోసారి స్టాలిన్‌ను బలపరిచేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని, ఈ ఎన్నికలలో డీఎంకే-కాంగ్రెస్ కూటమి ఘనవిజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## మైక్రో ఫైనాన్స్ కేసులో కీలక మలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (తీన్మార్ న్యూస్):



ప్రముఖ సింగర్ మంగ్లీ ప్రమేయం ఉందంటూ ప్రచారం జరుగుతున్న మైక్రో ఫైనాన్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన వ్యక్తిగా ఉన్న మధు అప్రూవర్‌గా మారారు. ఈ సందర్భంగా ఆయన మీడియాలో మాట్లాడుతూ అసలు ఈ కేసుతో సింగర్ మంగ్లీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. హేమాకాంత్ రెడ్డి అనే వ్యక్తి తనను మోసం చేశాడని, కంపెనీలో పెట్టిన సుమారు రూ. 20 కోట్లను ఆయనే తీసుకున్నాడని మధు ఆరోపించారు. అడ్వకేట్ సుబ్బారావు, హేమాకాంత్ రెడ్డి ఇద్దరూ స్నేహితులని ఆయన పేర్కొన్నారు.

**దయచేసి నా ఫోటోను వాడకండి**

మరోవైపు, ఈ వివాదంపై సింగర్ మంగ్లీ స్పందిస్తూ మీడియా ముందు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. నాన్న అంటే నాకు చాలా ఇష్టం. చిన్నప్పటి నుంచి నన్ను ఎంతో జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నారు. ఎవరికైనా అమ్మనాన్నలే అతిపెద్ద ఎమోషన్. కానీ మీడియాలో, టీవీల్లో ఈ కేసుకు సంబంధించి నా ఫోటోలు చూసి వారు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు అని మంగ్లీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరికీ కుటుంబాలు ఉంటాయి. మీడియాలో చూపే విధానాన్ని బట్టే ప్రజలు తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉంది. నన్ను ఇలా తప్పుగా చూపించడం వల్ల సోషల్ మీడియాకు, కొందరికి వచ్చే లాభం ఏంటి? అని ఆమె ప్రశ్నించారు. తన పేరు చెప్పి కొందరు డబ్బు వసూలు చేశారని, వారిపై ఇప్పటికే కేసులు పెట్టామని ఆమె తెలిపారు. మోసపోయిన బాధితులకు తాను తప్పకుండా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. దయచేసి ఈ వివాదంలో నా ఫోటోలను వాడకండి. నేను తప్పు చేసినట్లు ఆధారాలు ఉంటే నన్ను జైలుకు పంపండి. నేను ఏ తప్పూ చేయలేదు, అందరికీ నిజాలు తెలిసినా అసత్యాలు ప్రచారం చేయడం మా కుటుంబాన్ని తీవ్రంగా కలచివేస్తోంది. మీ ఇంటి ఆడబిడ్డను ఇలా ఏడిపిస్తారా? అని మంగ్లీ కన్నీటి పర్యంతమయ్యారు.

# జనసేనలోకి తోట చంద్రశేఖర్

**హైదరాబాద్ :** రిటైర్డ్ ఐఏఎస్ అధికారి తోట చంద్రశేఖర్ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కలిశారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో భేటీ అయ్యారు. దీంతో తోట చంద్రశేఖర్ మళ్లీ జనసేన పార్టీలో చేరబోతున్నారనే ఊహాగానాలు మొదలయ్యాయి. తోట చంద్రశేఖర్ 2019 ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ తరఫున పోటీచేసి ఓటమిపాలయ్యారు. అనంతరం చంద్రశేఖర్ బీఆర్ఎస్‌లో చేరి ఆ పార్టీ ఏపీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే.ఏపీ రాజకీయాల్లో మాజీ ఐఏఎస్ అధికారి తోట చంద్రశేఖర్ ఎపిసోడ్ తెరపైకి వచ్చింది. అనూహ్యంగా చంద్రశేఖర్ జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాశంగా మారింది. తోట చంద్రశేఖర్ మంగళగిరిలోని జనసేన పార్టీ ఆఫీసులో పవన్ కళ్యాణ్‌తో సమావేశం అయ్యారు. కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటున్న ఆయన.. ఉన్నట్టుండి పవన్ కళ్యాణ్‌ను కలడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.. తోట మళ్లీ జనసేన పార్టీలో చేరబోతున్నారనే ప్రచారం మొదలైంది.తోట చంద్రశేఖర్ మహారాష్ట్ర కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. 2008లో ఆయన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఆదిత్య హైజింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కొనసాగారు. అనంతరం రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు.. 2009 ఎన్నికల సమయం లో ప్రజారాజ్యం పార్టీ స్థాపనలో కీలకపాత్ర పోషించారు. జనసేన పార్టీలో కూడా కీలకంగా వ్యవహరించారు. చంద్రశేఖర్ మెగా బ్రదర్స్‌కు అత్యంత సన్నిహితుడిగా కొనసాగారు. కానీ ఆ తర్వాత వైఎస్సార్‌సీపీలో చేరిన చంద్రశేఖర్ 2014 ఎన్నికల్లో ఏలూరు ఎంపీగా పోటీచేసి ఓడిపోయారు. చంద్రశేఖర్ మళ్లీ జనసేన పార్టీలో చేరగా.. పవన్ కళ్యాణ్ ఆయనకు పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి అప్పగించారు. 2019 ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి జనసేన తరఫున ఎమ్మెల్యేగా పోటీచేసిన తోట ఓడిపోయారు. తోట చంద్రశేఖర్ మూడేళ్ల క్రితం బీఆర్ఎస్ పార్టీలో చేరగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా కేసీఆర్ బాధ్యతలు



అప్పగించారు. తద్వారా ఏపీలో కీలకంగా మారిన కాపులను తమవైపు తిప్పుకోవచ్చని కేసీఆర్ భావించారు. కానీ 2023 చివర్లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయింది. ఆ తర్వాత నుంచి చంద్రశేఖర్ రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఇప్పుడు మళ్లీ ఆయన పవన్ కళ్యాణ్‌ను కలవడతంతో జనసేన పార్టీలోకి వస్తారంటూ ఊహాగానాలు మొదలయ్యాయి.అయితే తోట చంద్రశేఖర్ పవన్ కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారా.. రాజకీయ కారణాలు ఉన్నాయా అనేది క్లారిటీ లేదు. చాలాకాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటున్న చంద్రశేఖర్ పవన్ కళ్యాణ్‌ను వెళ్లి జనసేన పార్టీ కార్యాలయంలో కలవడంతో, ఆయన జనసేన పార్టీలోకి రీ ఎంట్రీ ఇస్తారనే చర్చ మొదలైంది. ఈ రాజకీయ ఊహాగానాలపై తోట చంద్రశేఖర్ స్పందించాల్సి ఉంది.చంద్రశేఖర్ పవన్ కళ్యాణ్‌ను కలవడం పట్ల జనసేన సానుభూతి పరులు స్పందిస్తున్నారు. 2024 ఎన్నికలకు ముందు చంద్రశేఖర్ పార్టీని వీడకుండా ఉండుంటే.. గుంటూరు జిల్లాలో ముఖ్య నాయకుడిగా, లోక్ సభ ఎంపీగా అయ్యుండేవారని చెబుతున్నారు. ఆయన తిరిగి పార్టీలోకి వస్తే మంచిదేనని, ఒకవేళ ఇది మర్యాదపూర్వక కలయిక అయినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని అంటున్నారు. తోట చంద్రశేఖర్‌కు చెందిన టీవీ ఛానెల్ వైసీపీకి అనుకూలంగా మారుతుందనే భావన కలుగుతోందని.. ఇలాంటి టైంలో ఆయన పవన్ కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారా లేదా వ్యూహాత్మకంగా కలిశారా అనేది తెలియాల్సి ఉందని జనసేన లీగల్ వ్యవహారాలు చూసే శాంతి ప్రసాద్ సింగలూరి కామెంట్ చేశారు.

# 24ఏళ్లలో మోదీపై ఒక్క అవినీతి మచ్చ లేదు

బంగాల్‌లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తృణమూల్ కాంగ్రెస్ దోచుకున్న ప్రతి పైసాను వడ్డీతో సహా తిరిగి వసూలు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. 24 ఏళ్లుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలో ఉన్నప్పటికీ, ఆయనపై ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని ఆయన పేర్కొన్నారు. బుధవారం ఉత్తర బంగాల్‌లోని జల్పాయ్?గుడి జిల్లా రాజ్‌గంజ్‌లోని ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. "ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అధికారం నుంచి వైదొలగడం ఖాయం. ఆ ప్రక్రియను ప్రారంభించే బాధ్యత ఇక్కడ నుంచే ప్రారంభమవుతుంది. ప్రధాని మోదీ గుజరాత్‌లో 12 ఏళ్లు పాలించారు. కేంద్రంలో మరో 12 ఏళ్లుగా నాయకత్వం వహిస్తున్నారు. అయినా సరే ఒక్క రూపాయి అవినీతి ఆరోపణ కూడా ఎదుర్కోలేదు. బంగాల్?లో బీజేపీని అధికారంలోకి తీసుకురండి. టీఎంసీ నాయకులు ప్రజల నుంచి దొంగలించిన ప్రతి పైసాను, వడ్డీతో సహా మేం తిరిగి రాబడతాం" అని అమిత్ షా తెలిపారు.

**టీ తోట కార్మికులకు భూ హక్కులు**

బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీచర్ల నియామక స్కాంలో రూ.300 కోట్లు, ఉత్తర బంగాల్? వరద సహాయ నిధుల్లో రూ.100 కోట్లు దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అమిత్? షా హెచ్చరించారు. ఉత్తర బంగాల్? మూడు 'టీ'లతో (టీ, టింబర్, టూరిజం) ప్రసిద్ధి చెందిందని, కానీ సీఎం మమతా నాలుగో టీగా బీజేపీ కార్యకర్తల కన్నీళ్లను జోడించారని విమర్శించారు. ఉత్తర బంగాల్ అభివృద్ధికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. టీ తోట కార్మికులకు భూ హక్కులు కల్పించి వారిని భూస్వాములుగా మారుస్తామని వెల్లడించారు. టీఎంసీ గూండాలను గుర్తించి చట్టం ముందు నిలబెట్టడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం (ఈవీఎం)లో కమలం గుర్తుపై ఓటు వేసి బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు.



**'లవ్, ల్యాండ్ జిహాద్‌కు ముగింపు పలుకుతాం'**

ప్రజలు బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని, అప్పుడు బంగాల్ అంతటా ఎవరూ నాలుగు వివాహాలు చేసుకోలేరని అమిత్ షా తెలిపారు. తాము లవ్, ల్యాండ్ జిహాద్?కు ముగింపు పలుకుతామని అన్నారు. అలాగే మహిళలకు ప్రతి నెలా రూ. 3 వేలు, నిరుద్యోగ యువతకు రూ. 3000 ఇస్తామమని చెప్పారు. తల్లులు, సోదరీమణులు ప్రభుత్వ బస్సుల్లో టికెట్లు కొనాల్సిన అవసరం ఉండదు, వారు ఉచితంగా ప్రయాణించగలుగుతారుని అన్నారు.

**అధికారంలోకి వచ్చాక కేసుల ఉపసంహరణ : అమిత్ షా**

అధికారంలోకి వచ్చిన వెంటనే డార్జిలింగ్?లోని గూర్ఖాలాండ్ సమస్య పరిష్కారానికి రాజ్యాంగబద్ధంగా శాశ్వత పరిష్కారం చూపుతామని అమిత్? షా తెలిపారు. గతంలో జరిగిన హింసాత్మక ఆందోళనల నేపథ్యంలో గుర్ఖా సోదరులపై వేల సంఖ్యలో తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని ఉపసంహరిస్తామని స్పష్టం చేశారు. గుర్ఖా సమస్య పరిష్కారం కోసం గతంలో దిల్లీలో నిర్వహించిన మూడు సమావేశాలకు మమతా హాజరు కాలేదని ఆరోపించారు. మధ్యవర్తిని నియమించినప్పటికీ ఆమె సహకరించలేదని విమర్శించారు. రాష్ట్రంలో చొరబాట్లు, గూండా రాజ్యం, మాఫియా వ్యవస్థకు ముగింపు పలుకుతా మని పేర్కొన్నారు. బంగాల్‌లో మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొదటి దశ ఏప్రిల్ 23 కాగా, రెండో దశ 29న పోలింగ్ జరగనుంది. మే 24న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. 2021 బంగాల్ ఎన్నికల్లో టీఎంసీ 213 అసెంబ్లీ సీట్లు రాగా, బీజేపీకి 77 స్థానాల్లో గెలుపొందింది. ఈసారి ఎలాగైనా అధికార పీఠాన్ని కైవసం చేసుకోవాలని చూసుస్తోంది. అటు టీఎంసీ కూడా అదే ప్రయత్నంలో ఉంది.

# నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకించాలని నిర్ణయం తీసుకున్నాం

డీలిమిటేషన్ బిల్లుకు సంబంధించి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అయితే మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని, రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రం అనుసరిస్తున్న విధానంపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని చెప్పారు. రాజకీయ లబ్ధి కోసం కేంద్రం ప్రయత్నిస్తోందని ఖర్గే ఆరోపించారు. బుధవారం దిల్లీలోని ఖర్గే నివాసంలో ఇండి యా కూటమి నేతలు సమావేశమయ్యారు. 16వ తేదీ నుంచి 3రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ప్రతిపక్ష ఇండియా కూటమి సమావేశంలో ప్రధానంగా చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఖర్గే విపక్షాలను దెబ్బతీయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ బిల్లులు తెస్తోందని ఆరోపించారు.

"మహిళా రిజర్వేషన్ బిల్లుకు మేమంతా అనుకూలం. కానీ వారు దాన్ని తీసుకువచ్చిన విధానం పట్ల మాకు అభ్యంతరాలున్నాయి. ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపితం. కేవలం ప్రతిపక్ష పార్టీలను అణిచివేయడానికే ప్రభుత్వం ఇలా చేస్తోంది. మహిళా రిజర్వేషన్ బిల్లు మద్దతు ఇవ్వాలని మేమంతా నిర్ణయించాం. 2010 నుంచి 2023 వరకు రాజ్యాంగ సవరణకు అంగీకరించాం. పాత సవరణలనే అమలు చేయాలని కోరుతున్నాం. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) విషయంలో ప్రభుత్వం కొన్ని గిమ్మిక్కులు చేస్తోంది. పార్టీలన్నీ ఏకతాటిపై నిలిచి పార్లమెంటులో ఐక్యంగా పోరాడాలి. మేం ఈ బిల్లును వ్యతిరేకిస్తాం, కానీ మహిళా రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు. ఈ బిల్లులో వారు పొందుపరిచిన విధానం చూస్తే కనీసం జనాభా లెక్కల ప్రక్రియను కూడా పూర్తి చేయకుండానే డీలిమిటేషన్ అంశాన్ని చేర్చారు. రాజ్యాంగ అధికారాలన్నింటినీ కార్యనిర్వాహక వ్యవస్థ తన గుప్పిట్లోకి తీసుకుంటోంది. ప్రధానంగా వ్యవస్థలు, పార్లమెంటు చేతుల్లో ఉండాల్సిన అధికారాన్ని ఎప్పుడైనా డీలిమిటేషన్ మార్చుకునే వీలుగా వారు తమ చేతుల్లోకి తీసుకున్నారు. అసోం, జమ్మూకశ్మీర్‌లో వారు ఇప్పటికే మమ్మల్ని మోసం చేశారు."



**'ఎన్నికలు వేళ ఈ ప్రక్రియ ఎందుకు?'**

మరోవైపు, కేంద్రం తీసుకువస్తున్న డీలిమిటేషన్ బిల్లు చాలా ప్రమాదకరమైనదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. "లోక్‌సభలో పార్లమెంటరీ సీట్లను 50 శాతం పెంచుతామని, అదే సమయంలో అన్ని రాష్ట్రాల్లోనూ సీట్లను పెంచుతామని కేంద్ర హోం మంత్రి, పలువురు ఇతర మంత్రులు చెప్పారు. ఈ బిల్లు ఆధారంగా అనేక రాష్ట్రాల సీట్ల నిష్పత్తి తగ్గుతుంది. జమ్ము కశ్మీర్, అసోంలో పునర్విభజన కమిషన్ పనిచేసిన తీరు చూస్తే, మెజారిటీ సాధించేందుకు ఆ కమిషన్ బీజేపీ చేతిలో ఒక పావుగా మారిందని స్పష్టమైంది. 543 పార్లమెంటరీ సీట్ల ఆధారంగా మహిళా రిజర్వేషన్ జరగాలని ప్రతిపక్షాలన్నీ కోరుకుంటున్నాయి. కొత్త జనాభా లెక్కల తర్వాత నియోజకవర్గాల పునర్విభజన చేయాలి. అలాగే, అన్ని రాష్ట్రాలు, పార్టీలను ఒప్పించి డీలిమిటేషన్ చేయాలి. ఓ వైపు తమిళనాడు, బంగాల్‌లో ఎన్నికలు జరుగుతుండగా ఈ ప్రక్రియ ఎందుకు? డీలిమిటేషన్ కమిషన్ బీజేపీకి ఒక సాధనంగా పనిచేస్తుంది" అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పూర్తి మద్దతు ఇస్తుంది. మహిళా బిల్లు 2023లోనే పార్లమెంటు ఆమోదం పొందింది. మహిళా రిజర్వేషన్ బిల్లు ఇప్పటికే రాజ్యాంగంలో భాగమైంది. అయితే, ప్రభుత్వం ఇప్పుడు పెడుతున్న బిల్లుతో మహిళా కోటాకు సంబంధం లేదు. డీలిమిటేషన్‌తో గెర్రీమాండరింగ్‌కు పాల్పడే ప్రయత్నం చేస్తోంది. గెర్రీమాండరింగ్‌తో మళ్లీ అధికారం పొందేందుకు ప్రయత్నం చేస్తోంది. కులగణనను విస్మరించే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం చేస్తున్నారు. దక్షిణ, ఈశాన్య, వాయవ్య రాష్ట్రాలకు అన్యాయం జరిగితే సహించం."

**మేమంతా కలిసికట్టుగా ఈ బిల్లును ఓడిస్తాం!**

ఇదిలా ఉండగా, నియోజకవర్గాల పునర్విభజన అంశంపై జరిగిన ఇండియా బ్లాక్ సమావేశం అనంతరం శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ కూడా మాట్లాడారు. "ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతుండగా, ఈ బిల్లును తీసుకురావడానికి వాళ్లు (బీజేపీ) తొందరపడుతున్న తీరు చూస్తుంటే, ఆ రాష్ట్రాల ఎంపీలు ఓటింగ్‌కు రారని వారు అనుకుంటున్నారు. కానీ అందరూ ఓటింగ్‌కు వస్తున్నారు. డీలిమిటేషన్? బిల్లుపై మేమంతా కలిసికట్టుగా నిర్ణయం తీసుకుని ఈ బిల్లును ఓడిస్తాం. అయితే, మహిళా రిజర్వేషన్ బిల్లుకు మేం మద్దతు ఇస్తున్నాం. కానీ దాని ముసుగులో వాళు ఆడుతున్న ఈ నియోజకవర్గాల పునర్విభజన ఆట చాలా ప్రమాదకరం" అని సంజయ్? రౌత్? వ్యాఖ్యానించారు.

# మన తలలపై వేలాడుతున్న కత్తి మనపైనే పడింది

ప్రత్యేక పార్లమెంటు సెషన్‌లో నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్) బిల్లుకు సవరణ చేసేందుకు కేంద్రం యోచిస్తుండటంపై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ భగ్గుమన్నారు. ఈ సవరణ బిల్లును ప్రతిపాదించడం అనేది తమిళనాడు సహా అన్ని దక్షిణాది రాష్ట్రాలకు భారీ చారిత్రక అన్యాయం చేయడమేనని ఆయన మండిపడ్డారు. 'మన తలలపై వేలాడుతున్న కత్తి మనపైనే పడింది' అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందుకు నిరసనగా గురువారం రోజు (ఏప్రిల్ 16న) తమిళనాడువ్యాప్తంగా నల్లజెండాలతో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని స్టాలిన్ పిలుపునిచ్చారు. ఇళ్లు, బహిరంగ ప్రదేశాలపై నల్లజెండాలను ఎగురవేయాలన్నారు. ఆత్మగౌరవాన్ని కోరుకునే ప్రతీ తమిళుడు నల్లజెండాలతో కేంద్ర ప్రభుత్వానికి నిరసన తెలపాలని ఆయన కోరారు.

**పార్టీలు, ఎంపీలు ఏకం కావాలి**

తీవ్ర ఆందోళన రేకెత్తిస్తున్న ఈ పెను ముప్పును సమన్వయంతో ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై డీఎంకే ఎంపీలతో పాటు అన్ని రాష్ట్రాల్లోని ఎంపీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సీఎం స్టాలిన్ వెల్లడించారు. ఇది పార్టీలు, వ్యక్తులకు సంబంధించిన అంశం కాదని, తమ ప్రజల హక్కుల పరిరక్షణతో ముడిపడిన అంశమన్నారు. దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు అన్ని పార్టీలు, ఎంపీలు ఏకం కావాలని పిలుపునిస్తూ ఆయన ఒక ట్వీట్ చేశారు. బుధవారం ఉదయం ఎన్నికల ప్రచారం కోసం తమిళనాడులోని ధర్మపురికి స్టాలిన్ వెళ్లారు. అక్కడి నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీఎంకే ఎంపీలతో ఆయన అత్యవసరంగా సమావేశమయ్యారు. లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన వల్ల తమిళనాడు ఎదుర్కొనే పరిణామాలపై వారితో స్టాలిన్ చర్చించారు. ఆ వెంటనే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల డీఎంకే ముఖ్యనేతలతోనూ ఆయన సంభాషించారు. నిరసన కార్యక్రమాల నిర్వహణపై వారికి దిశానిర్దేశం చేశారు.

**దక్షిణాది రాష్ట్రాలను శిక్షిస్తున్నారా ?**



'భారతదేశ వృద్ధికి దోహదపడుతున్నామనే నేరానికి తమిళనాడు, దక్షిణాది రాష్ట్రాలను శిక్షిస్తున్నారా ? తమిళనాడు, దక్షిణ రాష్ట్రాలకు ఈ రూపంలో తిరిగి చెల్లిస్తున్నారా ? లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన చట్టానికి సవరణ దిశగా కేంద్రం అడుగులు వేస్తే, యావత్ దక్షిణాదిలో భారీ ఆగ్రహ జ్వాలలు ఎగిసిపడతాయి. దీనిపై వింధ్య పర్వతాలకు దక్షిణాన ఉన్న ప్రతీ దక్షిణ భారతీయుడు ఆగ్రహంతో రగిలిపోతున్నాడు. డీలిమిటేషన్ సవరణ బిల్లు విషయంలో బీజేపీ ముందుకే సాగితే తీవ్ర పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుంది. బీజేపీ నిప్పుతో చెలగాటం ఆడుతోంది. ప్రతిపాదిత డీలిమిటేషన్ సవరణ బిల్లును కేంద్రం ఉపసంహరించుకోకుంటే తీవ్ర పర్యవసానాలను ఎదుర్కొంటుంది. తమిళనాడు ప్రజల వాణిని వినిపించుకోకుంటే, బీజేపీ భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుంది. నేను డీఎంకే అధ్యక్షుడి హోదాలో ఈ మాటలు చెప్పడం లేదు. ఆత్మగౌరవం కలిగిన తమిళుడిగా నా మనసులోని మాటలను వినిపిస్తున్నాను' అని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ చెప్పారు.

**మహిళా కోటా ముసుగులో డీలిమిటేషన్ బిల్లు**

'మళ్లీ లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు బాగా తగ్గిపోతాయి. రాష్ట్రాల జనాభా ప్రాతిపదికన సీట్లను పెంచకూడదు. రాష్ట్రాల్లోని ప్రస్తుత లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల నిష్పత్తి ప్రాతిపదికనే డీలిమిటేషన్ జరగాలి. అన్ని రాష్ట్రాల హక్కులను కేంద్ర ప్రభుత్వం గౌరవించాలి. ఏప్రిల్ 16 నుంచి జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సెషన్‌లో బలవంతంగా రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. మహిళా రిజర్వేషన్ బిల్లు ముసుగులో నియోజకవర్గాల పునర్విభజన సవరణ బిల్లు ఆమోదానికి కుట్ర జరుగుతోంది. ఇప్పుడు అత్యంత ప్రమాదకర అంశం నియోజకవర్గాల పునర్విభజనే. 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్‌ను పూర్తి చేయాలని మోదీ సర్కారు భావిస్తోంది. ఈ ప్రతిపాదనను అన్ని విపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ఎందుకంటే అలా చేయడం సరికాదు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లోక్‌సభ సీట్లను 80 నుంచి 240కు పెంచాలని అనుకుంటున్నారు' అని డీఎంకే ఎంపీ దయానిధి మారన్ పేర్కొన్నారు.

**నల్ల చొక్కాలు ధరించి పార్లమెంటుకు**

'వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలోనే ఈ కీలకమైన సవరణ బిల్లుల ఆమోదానికి కసరత్తును కేంద్ర సర్కారు ఎందుకు మొదలుపెట్టింది ? ఈ వివాదాస్పద బిల్లులపై ఎన్నడూ అన్ని రాష్ట్రాలతో కేంద్రం చర్చించనే లేదు. బలవంతంగా వాటిని ఆమోదించుకునేందుకు యత్నిస్తున్నారు. ఇలా చేయడం దేశానికి మంచిది కాదని సీఎం స్టాలిన్ అంటున్నారు. డీఎంకే ఎంపీలమంతా నల్ల చొక్కాలను ధరించి పార్లమెంటుకు వెళ్తాం. ప్రతిపాదిత బిల్లులకు వ్యతిరేకంగా ఓట్లు వేస్తాం. తమిళనాడు ప్రజలంతా ఇళ్లపై నల్లజెండాలు పెట్టి, ప్రధాని మోదీతో ఏకీభవించం అనే సందేశాన్ని ఇస్తారు. తమిళనాడు ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేసే బీజేపీకి రాష్ట్ర ప్రజలు ఎన్నడూ ఓట్లు వేయరు' అని డీఎంకే ఎంపీ దయానిధి మారన్ చెప్పారు.

## మాతృమూర్తి పేరిట మొక్క నాటాలి

ప్రజలందరూ 9 పనులు చేస్తామంటూ ప్రతిజ్ఞ తీసుకోవాలని కోరారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. నీటి సంరక్షణ, ప్రకృతి వ్యవసాయం నుంచి ఫిట్‌నెస్, సేవ వరకు 9 ప్రతిజ్ఞలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందిన కర్ణాటక, భారత్?ను సాకారం కోసం 9 పనులు చేయాలన్నారు. కర్ణాటక మాండ్య జిల్లాలో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోదీ, ఆదిచుంచనగిరి మఠంలో గురు భైరవైఖ్య మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించిన మోదీ, ఈ మేరకు 9 ప్రతిజ్ఞలు పాటించాలని చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడిన మోదీ, మొదటి వాగ్దానంగా జల సంరక్షణను ప్రస్తావించారు. తర్వాత ప్రతి ఒక్కరూ 3 మొక్కలు నాటాలని సూచించిన ప్రధాని, అందులో ఒకటి తమ మాతృమూర్తి పేరిట నాటాలని కోరారు. బహిరంగ, మతపరమైన ప్రాంతాల్లో పరిశుభ్రత, స్థానిక ఉత్పత్తుల కొనుగోలు, స్థానిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం, చిరుధాన్యాలు తినడం, నూనె వాడకాన్ని తగ్గించడం ద్వారా ఆరోగ్యకరమైన భోజనం చేయడం వంటి ప్రతిజ్ఞలు చేయాలని సూచించారు. యోగా, శారీరక దారుఢ్యం, ప్రకృతికి సేవ చేయడం వంటి అంశాలను కూడా ప్రస్తావించారు.

"శ్రీ కాల భైరవ ఆలయాన్ని సందర్శించి పూజలు చేయడం, శ్రీ గురు భైరవైక్య ఆలయాన్ని ప్రారంభించడం నా మనసులో ఎప్పటికీ నిలిచిపోతాయి. మీ అందరి మధ్యకు వచ్చే అవకాశం లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నా హృదయం ప్రస్తుతం ఎన్నో భావోద్వేగాలతో నిండిపోయింది. వాటిని మాటల్లో వర్ణించడం కష్టం. భారతదేశం వేల సంవత్సరాలుగా వర్ధిల్లుతున్న ఒక సజీవ నాగరికత. ప్రపంచంలోని అతి తక్కువ దేశాలకు మాత్రమే ఇంత సుదీర్ఘ కాలం పాటు నిలిచి ఉండే సంప్రదాయాలు ఉన్నాయి. ఆదిచుంచనగిరి మహాసంస్థాన మఠం సంప్రదాయ నిరంతరతకు ప్రతీక. దాదాపు 2,000 సంవత్సరాల చరిత్ర ఈ మఠానికి ఉంది. మన సమాజంలో కేవలం ఆధ్యాత్మిక మార్గదర్శకత్వానికే పరిమితం కాని మహనీయులు పుడుతూనే ఉన్నారు. వారు ప్రజల మధ్యే జీవించారు. వారు ప్రజల సుఖదుఃఖాలను అర్థం చేసుకున్నారు. ప్రజల కష్టాలను స్వయంగా అనుభవించి, సమాజాన్ని దుఃఖం, బాధలు ఇబ్బందుల నుంచి బయటపడేసే మార్గాన్ని చూపించారు. దివంగత బాలగంగాధరనాథ మహాస్వామి విద్య, వైద్య రంగాల్లో మార్పు కోసం ఎంతో కృషి చేశారు. కర్ణాటక ఫిలాసఫి, టెక్నాలజీ రెండింటిలోనూ మెరుగ్గా ఉంటుందని నేను ఎప్పుడూ చెబుతూనే ఉంటాను."

**కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం**

అంతకుముందు కర్ణాటక మాండ్య జిల్లాలో పర్యటించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆదిచుంచనగిరి మఠానికి వెళ్లి అక్కడ గురు భైరవైఖ్య మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదిచుంచనగిరి మఠం 71వ పీఠాధిపతి బాలగంగాధరనాథ మహాస్వామి స్మృత్యర్థం ఈ ఆలయం నిర్మించారు. తర్వాత అక్కడ జరిగిన సభలో పాల్గొన్న ప్రధాని మోదీ, సౌందర్య లహరి– శివ మహిమ స్తోత్రం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాని ఎఀ దేవెగౌడ, కేంద్ర మంత్రి కుమారస్వామి, శోభా కరంద్లాజే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కొన్ని కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందిస్తున్నామని ప్రధాన మోదీ వెల్లడించారు. ప్రస్తుతం ఈ పథకం కింద 70 ఏళ్లు దాటిన వృద్ధులకు కూడా అవకాశం కల్పించామని వివరించారు.

## డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందాల్సిన పనిలేదు

మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కోసం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజనపై దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్రవర్గాలు తెలిపాయి. లోక్‌సభలో అన్ని రాష్ట్రాల వాటాను ఏకరీతిగా 50శాతం పెంచనున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పినట్లు జాతీయ మీడియా పేర్కొంది. దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందాల్సిన పనిలేదని కేంద్రవర్గాలు పేర్కొన్నాయి. 2011 జనాభా లెక్కలు ఇక్కడ నిర్ణయాత్మక అంశం కావని తెలిపాయి. అంటే దామాషా పరంగా చూస్తే ఎటువంటి మార్పూ ఉండదని, ప్రాతినిధ్యం తగ్గుతుందేమోనన్న దక్షిణాది ఆందోళనలను ఈ విధానం నివారిస్తుందని వివరించాయి. దక్షిణాది రాష్ట్రాలకు ఎటువంటి నష్టమూ వాటిల్లదని, ప్రతీ రాష్ట్రానికి కేటాయించిన సీట్ల సంఖ్య కూడా 50 శాతం పెరుగుతుందని స్పష్టం చేశాయి.

**అన్ని పార్టీలతో మాట్లాడిన తర్వాతే ఒక నిర్ణయం : నిర్మలా సీతారామన్**

మరోవైపు నియోజకవర్గాల పునర్విభజనను ప్రతిపక్ష కూటమి వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్? స్పందించారు. డీలిమిటేషన్ కమిషన్ ప్రతి రాజకీయ పార్టీని సంప్రదిస్తుందని స్పష్టం చేశారు. బంగాల్?లోని పూర్బ బర్ధమాన్‌లో పర్యటించిన ఆమె, ఈ మేరకు ప్రముఖ వార్త సంస్థ ఏఎన్ఐతో మాట్లాడారు. డీలిమిటేషన్ విభజిస్తుందన్న బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యలపై నిర్మలా సీతారామన్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఆమె మహిళలకు రిజర్వేషన్లను ఆపి, బంగాల్ ప్రజల మనసుల్లో భయాన్ని నింపడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. "లోక్‌సభలో సీట్లను 850కి పెంపు అనేది ఒక గరిష్ఠ పరిమితి. ప్రతి రాష్ట్రానికి ఒక డీలిమిటేషన్ కమిటీ ఉంటుంది. అది అన్ని పార్టీలతో మాట్లాడిన తర్వాతే ఒక నిర్ణయం తీసుకుంటుంది. మరి భయం ఎందుకు? మీకు ఎస్?ఐఆర్? అంటే భయమా? ఎన్నికల సంఘం, పార్లమెంట్ ఆమోదించిన ప్రతి చట్టం గురించి మీకు భయం. కానీ ఇక్కడ మీరేమీ చేయరు" అని నిర్మలా సీతారామన్ అన్నారు.

## అమర్‌నాథ్ యాత్ర రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

హిందువుల అత్యంత పవిత్ర యాత్రల్లో ఒకటైన అమర్‌నాథ్ యాత్ర 2026 కోసం నమోదు ప్రక్రియ బుధవారం నుంచి అధికారికంగా ప్రారంభమైంది. కశ్మీర్ హిమాలయాల్లో జరిగే ఆ యాత్ర 2026 జులై 3వ తేదీన ప్రారంభమై ఆగస్టు 28 వరకు కొనసాగునుంది. ప్రతి ఏడాది లాగానే ఈసారి కూడా లక్షలాది భక్తులు పాల్గొననున్నారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సంవత్సరం యాత్రకు నమోదు ప్రక్రియ మరింత సులభతరం చేయడానికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధానాలను అందుబాటులో ఉంచారు. భక్తులు శ్రీ అమర్‌నాథ్ శ్రైన్ బోర్డ్ అధికార వెబ్‌సైట్ ద్వారా ఆన్?లైన్?లో నమోదు చేసుకోవచ్చు. అదే విధంగా దేశవ్యాప్తంగా 550కి పైగా గుర్తింపు పొందిన బ్యాంక్? శాఖల్లో కూడా నమోదు సదుపాయం కల్పించారు. ఇందులో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యెస్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఈసీఈసీ బ్యాంక్‌లు ఉన్నాయి.



**ముందస్తు నమోదు అవసరం**

యాత్రలో పాల్గొనే భక్తులు వీలైనంత త్వరగా నమోదు పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. ఎంపిక చేసిన యాత్ర వివరాలు తేదీకి ఏడు రోజుల ముందుగానే మూసివేస్తారని తెలిపారు. నమోదు పూర్తయిన భక్తులకు సిస్టమ్? ద్వారా యాత్రా పర్మిట్ పత్రం అందుతుందని అన్నారు. దానిలో తేదీ, ఎంచుకున్న మార్గం, ప్రవేశ సమయం వంటి వివారాలు స్పష్టంగా ఉంటాయి. అంతే కాకుండా ఈ సంవత్సరం భద్రతా చర్యలు కట్టుదిట్టంగా మార్చారని తెలిపారు. అందులో భాగంగా యాత్ర సమయంలో యాత్రికుల కదలికలను పర్యవేక్షించేందుకు వీలుగా ప్రతి వ్యక్తికి ఆర్ఎఫ్ఐడీ(రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్) కార్డులు జారీ చేస్తారని చెప్పారు. యాత్రను సురక్షితంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు వీలుగా యాత్రికలు వైద్య పరీక్ష చేయించుకుని, తప్పనిసరి వైద్య ఫారాలను సమర్పించాలని కూడా పరిపాలన యంత్రాంగం ఆదేశించింది. అమర్‌నాథ్ యాత్ర భారతదేశంలోని అత్యంత ముఖ్యమైన మతపరమైన యాత్రలలో ఒకటి. ఇక్కడ లక్షలాది మంది భక్తులు సహజంగా ఏర్పడిన మంచు శివలింగాన్ని దర్శించుకోవడానికి కష్టతరమైన పర్వత మార్గాల గుండా ప్రయాణిస్తారు. ఈ ఏడాది యాత్ర జూలై 3 నుంచి ప్రారంభమై, మొత్తం 57 రోజుల పాటు కొనసాగనుంది. అంటే ఆగస్టు 28న రక్షా బంధన్ సందర్భంగా ముగియనుంది.

అమర్‌నాథ్ యాత్రకు ఎలా నమోదు చేసుకోవాలి

యాత్రకు వెళ్లాలని అనుకునేవారందరికీ అధికారులు రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేశారు. భక్తులు రెండు అధికారిక పద్ధతుల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు :

శ్రీ అమరనాథ్‌జీ ష్రైన్ బోర్డ్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ నమోదు

దేశవ్యాప్తంగా నిర్దేశిత బ్యాంకు శాఖలలో ఆఫ్‌లైన్ నమోదు

చెల్లుబాటు అయ్యే ప్రయాణ అనుమతిని పొందే ముందు దరఖాస్తుదారులు వ్యక్తిగత వివరాలు, పత్రాలు సమర్పించి, ధ్రువీకరణను పూర్తి చేయాలి. ఈ అనుమతి లేకుండా, పుణ్యక్షేత్ర మార్గంలోకి ప్రవేశం అనుమతి లేదు.

తీన్మార్

# హైబ్రీడ్ మోడల్ సాధ్యమా...

లోక్‌సభ సీట్ల సంఖ్యను భారీగా పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ప్రస్తుతం ఉన్న 543 స్థానాలను 850కి పెంచాలని ప్రతిపాదిస్తూ కేంద్రం గురువారం నాడు బిల్లులను ప్రవేశపెట్టనుంది. ఇందులో భాగంగా రాష్ట్రాల నుండి 815 సీట్లు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 35 సీట్లు ఉండేలా ప్రణాళిక రూపొందించారు. రెండు వారాలుగా ఈ విషయంపై రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు సాగుతుండగా, ఎంపీలకు ఈ ముసాయిదా చట్టం ప్రతులను పంపిణీ చేయడంతో ఈ ప్రక్రియ అధికారికంగా ముందడుగు పడింది. రాజ్యాంగంలోని అధికరణ 82 ప్రకారం, ప్రతి జనాభా గణన తర్వాత రాష్ట్రాలకు కేటాయించే లోక్‌సభ సీట్లను జనాభా మార్పులకు అనుగుణంగా సర్దుబాటు చేయాలి. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల విభజన 1971 జనాభా గణన ఆధారంగా జరిగింది. 2001లో చేసిన 84వ రాజ్యాంగ సవరణ ప్రకారం, 2026 తర్వాత జరిగే మొదటి జనాభా గణన వరకు నియోజకవర్గాల సరిహద్దుల మార్పుపై నిషేధం ఉంది. అయితే, తాజా బిల్లులో ఈ నిబంధనను సవరించి, 2011 జనాభా గణన ఆధారంగానే ఈ పునర్విభజన ప్రక్రియను చేపట్టాలని కేంద్రం భావిస్తోంది.మహిళా రిజర్వేషన్ల అమలుతో ఈ డిలిమిటేషన్ ప్రక్రియ ముడిపడి ఉండటం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది. 2023లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టం ప్రకారం, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33% సీట్లు కేటాయించాల్సి ఉంది. అయితే ఇది జనాభా గణన మరియు డిలిమిటేషన్ తర్వాతే సాధ్యమని ప్రభుత్వం గతంలో పేర్కొంది. తాజా ప్రతిపాదనల ప్రకారం సీట్ల సంఖ్యను 850కి పెంచితే, అందులో సుమారు 270 సీట్లు మహిళలకు రిజర్వ్ అవుతాయి. లోక్‌సభ స్థానాలను దాదాపు 50 శాతం పెంచాలన్న ప్రతిపాదనపై కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ.. ఈ ప్రక్రియ కేవలం అంకగణితంలా కాకుండా రాజకీయంగా అందరికీ సమన్యాయం చేసేలా ఉండాలని కోరింది. ముఖ్యంగా జనాభా నియంత్రణను సమర్థవంతంగా పాటించిన దక్షిణాది రాష్ట్రాలు, కేవలం జనాభా తక్కువగా ఉందన్న కారణంతో పార్లమెంట్‌లో తమ ప్రాతినిధ్యాన్ని కోల్పోకూడదని సోనియా గాంధీ అభిప్రాయపడ్డారు. ఉత్తరాది రాష్ట్రాలలో జనాభా పెరుగుదల ఎక్కువగా ఉన్నందున, సీట్ల పెంపు వల్ల వారికి అదనపు లబ్ధి చేకూరితే దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కినట్లు అవుతుందని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను పొడిగించిన ప్రభుత్వం, ఈ మూడు రోజుల ప్రత్యేక వ్యవధిలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. రేవంత్ రెడ్డి లాంటి నేతలు ప్రతిపాదిస్తున్న హైబ్రీడ్ మోడల్, రాష్ట్రాల మధ్య సీట్ల నిష్పత్తి మారకుండా సీట్లు పెంచే వ్యూహాలను కేంద్రం పరిగణనలోకి తీసుకుంటుందో లేదో వేచి చూడాలి. ఏది ఏమైనా, దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చేసే ఈ డిలిమిటేషన్ ప్రక్రియపై ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతోంది. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ స్థానాలను పెంచే ప్రక్రియను వేగవంతం చేస్తున్న తరుణంలో, స్టాలిన్ దీనిపై తీవ్రమైన హెచ్చరికలు జారీ చేశారు.ముఖ్యమంత్రి స్టాలిన్ తన తాజా వీడియో సందేశంలో కేంద్ర ప్రభుత్వానికి తుది హెచ్చరించారు. కేవలం జనాభా ప్రాతిపదికన డిలిమిటేషన్ చేపడితే, దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది కేవలం బెదిరింపు కాదు.. తమిళనాడు ఎన్నడూ చూడని రీతిలో ఒక మహా ఉద్యమాన్ని చూస్తారు. ప్రతి కుటుంబం వీధిలోకి వస్తుంది, రాష్ట్రం మొత్తం స్తంభిస్తుంది అని ఆయన ఘాటుగా హెచ్చరించారు. 1950, 60లలో హిందీ వ్యతిరేక ఉద్యమాల సమయంలో డీఎంకే చూపిన ఉధృతిని మరోసారి దేశం చూస్తుందని ఆయన సంకేతాలిచ్చారు.తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించి జనాభాను నియంత్రించాయని, ఇప్పుడు జనాభా తక్కువగా ఉందని పార్లమెంట్‌లో సీట్లు తగ్గించడం అంటే అభివృద్ధి చెందిన రాష్ట్రాలను శిక్షించడమేనని స్టాలిన్ వాదిస్తున్నారు. జనాభా పెంచుకున్న రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు ఇచ్చి, నియంత్రించిన రాష్ట్రాలకు అన్యాయం చేయడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఇది సమాఖ్య స్ఫూర్తిపై దాడి అని, దక్షిణాదిని రాజకీయంగా బలహీనపరిచే కుట్రని స్టాలిన్ అంటున్నారు. ఇండియా కూటమిలో కీలక సభ్యుడైన స్టాలిన్, ఈ విషయంలో కూటమి యొక్క గొంతుకగా మారారు. డిలిమిటేషన్ అనేది కేవలం అంకెల గారడీ కాకూడదని, అది రాజకీయ సమానత్వం కల్పించేలా ఉండాలని కూటమి డిమాండ్ చేస్తోంది. ఇప్పటికే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన హైబ్రీడ్ మోడల్ జనాభాతో పాటు జిఎస్‌డిపిని పరిగణనలోకి తీసుకోవడం పై కూటమిలో చర్చ జరుగుతోంది. రాష్ట్రాల మధ్య ఉన్న ఆర్థిక, సామాజిక వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకోకుండా ముందుకు వెళ్తే తీవ్ర ప్రతిఘటన ఎదురవుతుందని కూటమి స్పష్టం చేసింది.మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలంటే డిలిమిటేషన్ తప్పనిసరి అని కేంద్రం చెప్పడాన్ని స్టాలిన్ తప్పుబడుతున్నారు. మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ ఆ పేరుతో దక్షిణాది రాష్ట్రాల సీట్ల వాటాను తగ్గించే ప్రయత్నాన్ని సహించబోమని ఆయన స్పష్టం చేశారు. మహిళా కోటాను నియోజకవర్గాల పెంపుతో సంబంధం లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన, స్టాలిన్ హెచ్చరికలతో ఈ డిలిమిటేషన్ అంశం కేవలం తమిళనాడుకు పరిమితం కాకుండా మొత్తం దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి సమస్యగా మారుతోంది. ఇప్పటికే కేరళ, కర్ణాటక నేతలతో స్టాలిన్ సంప్రదింపులు జరుపుతున్నారు. కేంద్రం ఏకపక్షంగా ముందడుగు వేస్తే, ఉత్తరాది వర్సెస్ దక్షిణాది అనే భావన దేశ సమగ్రతకు భంగం కలిగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# చరమాంకంలో తెలుగు నాటక రంగం

19వ శతాబ్దంలో అనువాద నాటకాలకు అధిక ప్రాధాన్యమున్న సమయంలో ప్రదర్శనలను దృష్టితో ఉంచుకొని కందుకూరి వ్యవహార ధర్మబోధిని అనే నాటకం రాసి, షేక్స్పియర్ రాసిన కామెడీ ఆఫ్ ఎర్రర్స్ అనే అంగ్ల నాటకాన్ని చమత్కార రత్నావళి పేరుతో 1880లో అనువదించి తన విద్యార్థుల చేత ప్రదర్శిపం చేశారు. తెలుగు నాటకరంగంలో తొలి నాటక సమాజాన్ని కూడా వీరేశలింగమే స్థాపించారు. ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని 2007లో తెలుగు నాటకరంగ దినోత్సవంగా నిర్ణయించడం జరిగింది. నాటకం అనేది ఒక శ్రవణ సహిత దృశ్యరూపకం. జానపద కళలు విలసిల్లుతున్న రోజులలో, రాజుల పరిపాలనా కాలంలో ప్రజల వినోదం కోసం అత్యధికంగా ఆదరింపబడిన కళ నాటకం. రంగస్థలం వినోద ప్రదేశమే కాదు; వివిధ సంస్కృతుల్నీ. జాతుల్నీ, మనుషుల్నీ ఒకటిగా కలిపే ప్రక్రియ.నాటకం సంగీతం, పాటలు, నృత్యాలతో కూడుకొన్న ప్రక్రియ. పదహారవ శతాబ్దంలో ప్రారంభమైన నాటక ప్రక్రియను చిందు భాగవతము యక్షగాన నాటకం, వీధి భాగవతం, బయలాట అనీ పిలుస్తారు. వీధి నాటకాలను ఎక్కువ ప్రచారంలోకి తెచ్చినవారు కూచిపూడి భాగవతులు. తెలుగు నాటకరంగ చరిత్ర, తెలుగులో ఆదికవిగా పేరుగాంచిన నన్నయ్య తన భారత అవతారికలో రసాన్విత కావ్యనాటకముల్ పెక్కుజూచితి అనడాన్ని బట్టి, నన్నయ కాలానికి నాటక ప్రదర్శనలుండేవని అర్థం చేసు కోవచ్చు. తెలుగు దేశంలో ఆధునిక నాటక రచన ప్రదర్శనలకు దారితీసిన వారు పాఠశాలల్లో, కళాశాలల్లో పనిచేసిన ఉపాధ్యాయులు, ప్రధానంగా పండితులైన కోరాడ రామచంద్రశాస్త్రి, కొక్కొండ వెంకటరత్నం పంతులు, పరవస్తు వెంకట రంగాచార్యులు, వావిలాల వాసుదేవశాస్త్రి తదితరులు ఆధునిక తెలుగు నాటక రచనా ప్రారంభ విషయాన ప్రథములు. కందుకూరి వీరేశలింగం, కొండుభొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి, నాదెళ్ళ పురుషోత్తమ కవి, వడ్డాది సుబ్బారాయుడు ఆధునిక తెలుగు నాటక ప్రదర్శనారంభ విషయంలో ప్రథములు. ఆధునిక నాటక రచన 1860 ప్రాంతాల్లో ఆరంభంకాగా నాటక ప్రదర్శన మాత్రం 1880 లో ప్రారంభమయ్యింది. ఆధునిక కాలంలో వెలువడిన తొలి తెలుగు నాటకం1860 ప్రాంతాల్లో కోరాడ రామచంద్ర శాస్త్రిచే సంస్కృతంలో నుంచి నాటక లక్షణాలను అనుసరించి తెలుగులో వెలువడిన స్వతంత్ర రచన"మంజరీ మధుకరీయము". 'ఆంధ్రా జాన్సన్ 'గా సుప్రసిద్ధులైన కొక్కొండ వెంకటరత్నం పంతులు 1871లో వారణాశి ధర్మసూరి సంస్కృతంలో రచించిన "నరకాసుర విజయము" అనే వ్యాయోగమును ఆంధ్రీకరించాడు. పరవస్తు వెంకట రంగాచార్యులు 1872 ప్రాంతాల్లో కాళిదాసు రచించిన "అభిజ్ఞాన శాకుంతలము"ను ఆంధ్రీకరించడం జరిగింది. వావిలాల వాసుదేవశాస్త్రి ఆంగ్ల నాటక ఆంధ్రీకరణ ద్వారా జూలియస్ సీజర్ నాటకాన్ని "సీజరు చరిత్రము" అను పేరుతో 1874 లో ఆసాంతం తేటగీతిలో రాశాడు. ఆధునిక నాటక రచనకు ఆద్యులు వారైతే, ఆధునిక నాటక ప్రదర్శన ఆరంభ దశకు కందుకూరి వీరేశలింగం పంతులు, కొండుభొట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి, నాదెళ్ళ పురుషోత్తమకవి, వడ్డాది సుబ్బారాయుడు రూపకర్తలు. వీరేశలింగం సంభాషణ రూపాన "బ్రాహ్మ వివాహము" అను ప్రహసనమును తన "హాస్య సంజీవని" అను పత్రికలో రచించగా, అనంతరం "వ్యవహార ధర్మబోధిని" వ్యావహారిక భాషలో రచించి, ప్రదర్శన భాగ్యం కలిగించిన తొలి తెలుగు నాటకమిది. 1880 లో వీరేశలింగం నాటక సమాజాన్ని స్థాపించి "రత్నావళి", "చమత్కార రత్నావళి" అను రెండు నాటకాలను ప్రదర్శించాడు. తెలుగునాట తొలి నాటక సమాజాన్ని స్థాపించిన ఘనత వీరేశలింగందే. ఆయన స్వతంత్ర రచన



అయిన "వ్యవహార ధర్మబోధిని", సంస్కృత నాటక అనువాదమైన "రత్నావళి", ఆంగ్ల నాటక అనుసరణ అయిన "చమత్కార రత్నావళి" ప్రదర్శన భాగ్యం పొందిన తొలి తెలుగు నాటకాలు. ఇది 1880 లో జరిగింది. అందుచేత 1980 వ సంవత్సరం తెలుగు నాటకరంగ శతజయంతి సంవత్సరం అయింది. తెలుగు నాటకాలలో పద్య పఠనమును (ఈనాడు వలె గానం కాదు) ప్రవేశపెట్టినది వడ్డాది సుబ్బారాయుడు. వీరి నాటకాలలో ప్రసిద్ధమై, "వేణీ సంహారము". తెలుగులో గద్య, పద్యాత్మకం కాగా, పద్యాలని రంగస్థలం మీద పఠించేవారు. 1884-86 మధ్య నాదెళ్ళ పురుషోత్తమ కవి 32 హిందూస్తానీ నాటకాలు రచించాడు. వీటిని 15 ఏళ్ళపాటు అనేక పట్టణాలలో విజయ వంతంగా ప్రదర్శించారు. పాత్రోచిత భాష, అనుప్రాసయుక్తము ప్రాబంధికము అయిన శైలి ఆయన పాటించిన అంశాలు. పాటలు (టపాలు) పాడుట ఇతడు ప్రవేశపెట్టిన క్రొత్త అంశము. ఈ మూడు అంశాలు కాలక్రమంలో తెలుగు నాటక రంగం మీద ప్రాధాన్యం వహించాయి. ధర్మవరం రామకృష్ణమాచార్యులు వారు తన తొలి తెలుగు నాటకమైన "చిత్రనళీయం"ను బళ్ళారిలో 1887 జనవరి 29న విజయవంతంగా ప్రదర్శించారు. రామకృష్ణమాచార్యులవారు 30 నాటకాలు రచించారు. అన్నీ స్వతంత్ర రచనలే. తన నాటకాలలో పాటలు ప్రవేశ పెట్టారు. పద్యాలను రాగయుక్తంగా పాడడం కూడా ప్రవేశ పెట్టారు. అయన "సారంగధర" తెలుగులోని తొలి స్వతంత్ర విషాద రూపకం. ప్రాచ్య-పాశ్చాత్య సిద్ధాంతాలను సమన్వయించడంలో ప్రథములైనందునే "ఆంధ్ర నాటక పితామహ" అని బిరుదునిచ్చి సత్కరించారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం 1989లో నాటక రచన ఆరంభం చేయగా, అయన నాటకాలలో "గయోపాఖ్యానం" సుప్రసిద్ధమైనది. 1891లో " వెంకట రాయశాస్త్రి రచించిన "ప్రతాపరుద్రీయం" బహుళ ఖ్యాతినొందింది. 1887లో ప్రకటితమైన గురజాడ అప్పారావుగారి "కన్యాశుల్కం" వ్యావహారిక భాషలో రచించబడ్డ అత్యుత్తమైన నాటకం. 1892 ఆగస్టులో విజయనగరంలోని జగన్నాథ విలాసినీ నాటక సమాజం వారు దీనిని ప్రథమంగా విజయవంతంగా ప్రదర్శించారు. వ్యావహారిక భాషలో ఓ కొత్త మలుపు తెచ్చిన నాటకమిది. "ప్రతాపరుద్రీయం", "కన్యాశుల్కం" రెండు రాత్రుల రూపకాలు కాగా 1894 ప్రాంతాల నుంచి వివిధ నాటక రచనలు చేసినవారు కోలాచలం శ్రీనివాసరావు. అధికంగా చారిత్రక నాటకాలు రచించడంచేత "చారిత్రక నాటక పితామహుడు"గా పేరొందారు. ఆయన నాటకాలలో "కర్ణాటక రాజ్యనాశము" లేదా "రామరాజు చరిత్రము"నకు తెలుగుదేశ మంతటా విశేష ప్రాచుర్యం తెచ్చినవారు కోలాచలం మేనల్లుడైన బళ్ళారి రాఘవ. పానుగంటి లక్ష్మీ నరసింహారావు గారు రచించిన తొలి నాటకం "నర్మదాపురుకుత్సీయము" 1900లో ప్రకటితమైంది. ఆయన నాటకాలలో "రాధాకృష్ణ", "పాదుకాపట్టాభిషేకం", "కంఠాభరణము" ప్రసిద్ధమైనవి. " 1900 నాటికి తెలుగు నాటక రచన, ప్రదర్శన వ్యాసంగాలు తెలుగుదేశంలోని అన్ని ప్రాంతాలకూ వ్యాపించాయి. 1906-20 మధ్య కాలంలో బయల్దేరిన "హరిశ్చంద్ర" నాటకాలు 13. "సారంగధర 8. ఇంకా అనేక ఇతర నాటకాలు. ధర్మవరం రామకృష్ణమాచార్యుల ప్రభావం వల్ల నాటకాలలో పద్యాలకు, పాటలకు విలువ హెచ్చిన కాలమిది. ఈ కాలంలోని ముఖ్య విశేషం తెలుగుదేశంలో వ్యాపార నాటకరంగం విజృంభించడం. 1913 ప్రాంతాల్లో కృష్ణా మండలంలో నాటక పోటీలు ప్రారంభమై దేశమంతటా వ్యాపించాయి. "గయోపాఖ్యానం", "పాండవ ఉద్యోగ విజయములు", "బొబ్బిలి యుద్ధం", "రంగూన్ రౌడి" మొదలగు నాటకాలకు విడివిడిగా పోటీలు జరిగాయి. 1929లో ఆంధ్ర నాటక కళా పరిషత్తు తెనాలిలో స్థాపించబడింది. 1930 నుంచి సాంఘిక నాటకోద్యమం విజృభించింది. "విశ్వశాంతి", "ఎన్.జీ.ఓ.", "మా భూమి", "కీర్తిశేషులు", "నిర్మల" "కుక్క" వంటి నాటక రచనల ద్వారా రచయితలు సమాజంలో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. 1935-44 మధ్య కాలంలో రేడియో రూపకం ఆవిర్భవించి అభివృద్ధి చెందింది. కాళ్ళకూరి నారా యణరావు రచించిన "చింతామణి", "వరవిక్రయం", "మధుసేవ" సమస్యల ఆలంబనగా వెలసిన నాటకాలు. ఇలా వుండగా సంప్రదాయాల ఆధిక్యాన్ని రూపుమాపడం కోసం రచనలు చేసినవారు త్రిపురనేని రామస్వామి, ముద్దుకృష్ణ, గుడిపాటి వెంకట చలం, ఆమంచర్ల గోపాలరావు మొదలగువారు. ఈ కాలంలో దువ్వూరి రామిరెడ్డి గారి "కుంభరాణా", విశ్వనాథ సత్యనారాయణ "నర్తనశాల" ఉత్తమ విషాద రూపకాలు. 1930 తర్వాత ఆంధ్ర రాష్ట్ర ఉద్యమానికి సంబంధించిన నాటకాలు కూడా వెలిశాయి. 1944-45 తరువాతి కాలాన్ని నాటక/నాటిక పోటీల యుగం అనవచ్చు. 1937 నుంచి రేడియో నాటికలు, 1944-45 నుంచి రంగస్థల ఏకాంకికలు పుంఖాను పుంఖాలుగా వెలువడు తున్నాయి. 1964లో ఎన్.ఆర్.నంది రచించిన "మరో మొహెంజొదారో" నాటకం ద్వారా తెలుగు నాటక ప్రయోగంలో "ఫ్రీజ్" ప్రవేశించింది. ఆ తరువాత లెక్కలేనన్ని ప్రయోగాలు ఆధునిక నాటకరంగాన్ని వరించాయి. సాంఘిక నాటకాలలో లేజర్ టెక్నిక్‌ను వాడడం ద్వారా సైంటిఫిక్ పోకడలను సైతం గ్రహించి ప్రదర్శించే అవసరం అనివార్యం అయింది. ఇక ప్రస్తుతం రంగస్థలానికి కావల్సిన సౌకర్యాలు సరైన థియేటర్లు లేవు. ఏదో హాలులో నాటకం వేయ్యాల్సిన పరిస్థితులు. అతి ముఖ్యమైన మైకులూ, స్పీకర్ సిస్టములూ ఉండవు. ఉన్నా సరిగా పనిచేయవు. మైకులు మొరాయించని నాటకం ఉండదూ అంటే అతిశయోక్తి కాదు. నటులూ అంటే సినిమా నటులే అన్న ఒక అభిప్రాయం బలంగా నాటుకు పోయింది. సినిమాల్లో నటన ముక్కలు ముక్కలుగా చిత్రీకరించ బడుతుంది. నాటకంలో ఏకబిగిన మొత్తం సన్నివేశంలో నిమగ్నమై నటించాలి. అది చాలా కష్టం. నాటకాలు వేసిన వాళ్ళు సినిమాల్లో రాణిస్తారేమో కానీ, సినిమా నటులు నాటకాల్లో రాణించడం అంత సులభం కాదు. ఇది వరకు తెలుగు సినిమా నటుల్లో అధికులు నాటక రంగం నుండి వచ్చిన వారే అన్న విషయం గుర్తుంచు కోవాలి. ఏటా నంది నాటకాలు పేరు చెప్పి ఓ పది పదిహేను నాటకాలు వేయించి ప్రభుత్వమూ చేతులు దులిపేసు కుంతిండ్. ప్రభుత్వాలు చొరవ తీసుకుని, నాటక సంస్థలకు చేయూత అందించి, ప్రోత్సహిస్తే తప్ప మినుకు మినుకు మంటూ అరి పోవడానికి సిద్దంగా ఉన్న నాటకరంగం బతికి బట్ట కట్టడం కష్టం. ఈ విషయాన్ని ప్రభుత్వాలు ఇకనైనా గ్రహించక పోతే చరమాంకంలో ఉన్న నాటక రంగం తెర మరుగుకాక తప్పనిస్థితి నెలకొంది.

# నాటకరంగంలో స్థానం వారి వైశిష్ట్యం

ఆంధ్ర నాటక రంగ చరిత్రలో నరసింహారావుది ప్రత్యేక స్థానం. నాటక రంగం మనగలిగినంత కాలం ఆయన పేరు శాశ్వతంగా నిలిచి పోతుంది. ఆయన స్త్రీ పాత్రధారణలో అసాధారణ ప్రజ్ఞ కనబరచి నాటక రంగానికే వన్నె తెచ్చారు. పురుషులే స్త్రీ వేషాలు వేసే ఆ నాటి రోజుల్లో రంగస్థలంపై విభిన్నమైన, పరస్పర విరుద్ధ మయిన పాత్రలను ధరించి, ధరించిన ప్రతి పాత్రలోను తమదైన ప్రత్యేకతను చూపించి లీనమై, ముప్ఫయి సంవత్సరాలపాటు లక్షలాది మంది ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల్ని చేసిన ప్రతిభ ఆయనకే సొంతం. నటకావతంస, నటశేఖర, నాటకకళా ప్రపూర్ణ, పద్మశ్రీ వంటి బిరుదులు, పురస్కారాలు ఆయనను వరించాయి. స్థానం నరసింహారావు (సెప్టెంబర్ 23, 1902 – ఫిబ్రవరి 21, 1971) ప్రసిద్ధ రంగస్థల, తెలుగు సినిమా నటులు. సత్యభామ, చిత్రాంగి మొదలైన అనేక స్త్రీ పాత్రలను సుమారు 40 సంవత్సరాలకు పైగా ధరించి 3వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ప్రేక్షకాభిమానంతో సహా పద్మశ్రీ పురస్కారం పొందాడు. స్థానం నరసింహారావు 1902, సెప్టెంబర్ 23 న హనుమంతరావు, ఆదెమ్మ దంపతులకు గుంటూరు జిల్లా బాపట్ల లో జన్మించారు. ఆయన చిన్నతనంలో కూచిపూడి భాగవతులు వచ్చి బాపట్లలో ప్రదర్శనలు ఇచ్చేవారు. అందులో వెంపటి వెంకటనారాయణ అనే ఆయన భామ వేషం అద్భుతంగా కట్టేవారట. ఆ స్త్రీ వేషం తన మనసులో ఎంతో ఆదరంతో మనసులో నిలిచి పోయి ఉండేదని చెప్పారు. ఈ దృశ్యాలన్నీ ఆయన రంగస్థల ప్రవేశం చేయడానికి దోహ దం చేశాయి. 1921లో బాపట్లలోనే జంటకవులైన తిరుపతి వేంకట కవులకు, కొప్పరపు కవులకు శతావధానం పోటీ జరిగింది. నెగ్గిన తిరుపతి వేంకటకవులని సత్కరిం చాలని భావించారు. ఆ సందర్భం గా ప్లీడరు గుమస్తాల బృందం చేత సత్య హరిశ్చంద్ర నాటకం వేయించాలని నిర్ణయించారు. ఆహ్వానాలు వెళ్లిపోయాయి. కానీ చంద్రమతి వేషధారి అస్వస్థుడై రాలేకపోతున్నట్టు చివరి నిమిషం లో తెలిసింది. ప్రత్యామ్నాయం ఏదీ సాధ్యం కాలేదు. చంద్రమతి పాత్రధారి మరొకరు దొరకలేదు. మరో నాటకం వేద్దామంటే పాత్రధారులంతా లేరు. గుండెల్లో రాయిపడింది. అప్పుడే ఆపద్బాంధవుడిలా స్థానం దొరికాడు చోర గుడి హనుమంతరావుకి. వారి నాటకం రిహార్సల్స్ జరుగు తున్నప్పుడు వెళ్లి కూర్చోవడంతో పద్యాలన్నీ వచ్చేశాయి. ఒకసారి ఎవరూ లేనప్పుడు పాడుకుంటూ ఉంటే హనుమంతరావు విన్నారు. ఆ ధైర్యంతోనే చంద్రమతి వేషం వేయించారు. స్థానం వారికి చిన్న తనంలోనే చిత్రలేఖనం కూడా అబ్బింది. ఆ కళతోనే, వేరే ఒకరి ఇంట రహస్యంగా తన వేషం తనే వేసుకున్నారాయన. చిన్న చిన్న లోపాలు ఉన్నా అరంగేట్రంలోనే తిరుపతి కవుల ఆశీస్సులు అందుకున్నారు స్థానం. తెనాలిలోని శ్రీరామ విలాస సభలో ప్రవేశించి ఆకాలంలోని గొప్ప నటులందరి సరసన పాత్రలు ధరించి దేశమంతటా పర్యటించి అపారమైన అనుభవం సంపాదించారు. వరంగల్‌లో 'కృష్ణలీల' నాటకంలో యశోద వేషం వేసినందుకు ఆయన జీవితంలో తొలి బంగారు పతకం వచ్చింది. అనతికాలంలోనే ఆయన పేరు మారుమోగి పోయింది. కాపురం బాపట్ల నుంచి తెనాలికి మారింది. "శ్రీరామవిలాస సభ" అనే నాటక సమాజాన్ని స్థాపించి నటననే జీవికగా చేసుకున్నారు. రోషనార (రోషనార నాటకం), తామినా (రుస్తుం సొహరాబ్ నాటకంలో), సంయుక్త (రాణీ సంయుక్త), శకుంతల (అభిజ్ఞాన శాకుంతలం), సత్యభామ (శ్రీకృష్ణ తులాభారం), చిత్రాంగి (సారంగ ధర), దేవదేవి (విప్రనారాయణ), కోకిల (కోకిల నాటకం), మల్లమ్మ (బొబ్బిలి), మధురవాణి (కన్యా శుల్కం), అనసూయ (అనసూయ నాటకం), మురాదేవి (చంద్రగుప్త), చింతామణి (చింతామణి), సుభద్ర (వీరాభిమన్య), సరళ (ఛత్రపతి శివాజీ), విద్యాధరి (కాళిదాసు), చండిక (చండిక నాటకం) వంటి పాత్రలు వేశారు. ఎన్ని పాత్రలు పోషించినా,



ఆయన వేసిన సత్య భామ పాత్ర పోషణ న భూతో న భవిష్యతి. "మీర జాల గలడా నా యానతి" అన్న పాటకు ఆయన చేసిన గాత్రం, చూపిన అభినయం నాటక ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయాయి. ఆంధ్రదేశంలో దాదాపు 3,000 సార్లు రంగస్థలం మీద పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలలో స్త్రీ పాత్రలను ధరించి ప్రజాభిమానాన్ని చూరగొన్నాడు. శృంగార రసాన్ని ప్రతిబింబించే రీతిలో సత్యభామ పాత్ర, ప్రణయానికి చిత్రాంగిగా, వీరరసాన్ని చిత్రించడంలో రోషనార నాటకంలో రోషనారగా, వలపుల చింతామణిగా, ప్రణయదేవతగా, భక్తురాలిగా, దేవదేవిగా, మధురాతి మధురమైన మధుర వాణిగా నవరసాలు కలిగిన పాత్రలను ప్రతిభావంతంగా పోషించాడు. వేషధారణ, వస్త్రాలంకరణలో స్థానం వారిది ఒక ప్రత్యేకత. రకరకాల చీరకట్టు సొగసులతో మనోహరంగా రంగస్థానం మీదకు ప్రవేశించి ప్రేక్షకుల్ని మంత్ర ముగ్ధుల్ని చేశారు. వీరు సినీ రంగంలో రాధాకృష్ణ (1939), సత్యభామ) వంటి కొన్ని సినిమాలలో నటించారు. 1931 నుండి 1942 వరకు మద్రాసులో సినీనటుడిగా వున్నారు. ఆయన పాడిన పాటలు, పద్యాలు గ్రామ ఫోన్ రికార్డులుగా వచ్చి శ్రోతల్ని ఎంతగానో అందించాయి. తన నటనానుభవాలను చేర్చి "నట స్థానం" అనే గ్రంథాన్ని ఆయన రచించారు. స్థానం నరసింహారావు 1971 ఫిబ్రవరి 21 తేదీన మరణించారు. 1956లో భారత ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఆయన ఈ బహుమతిని పొందిన తొలి ఆంధ్రుడు, కళాకారుడు. ఆయన రంగ స్థలం పై చూపించిన సమయ స్ఫూర్తికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 10వ తరగతి తెలుగు వాచకంలో ఒక పాఠం కూడా పెట్టింది. అయన నటనకు ముగ్ధులైన రంగూన్ ప్రజలు 1938లో బంగారు కిరీటాన్ని బహూకరించారు.



# బాడీలోని కొవ్వు మంచులా కరగాలంటే?

ఏవవతీజీ చిజీబివతీ: ఈ రోజుల్లో ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో సామాన్యుల నుంచి స్టార్ల వరకు అందరూ రకరకాల హెర్బల్ డ్రింక్స్‌పై మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా బరువు తగ్గడానికో, జీర్ణక్రియ మెరుగుపడటానికో చాలామంది రోజూ జీలకర్ర నీరు తాగుతుంటారు. అయితే ఈ నీటిని ఎప్పుడు తాగాలి? ఎలా తయారు చేయాలి? అనే విషయంలో చాలామందికి సరైన అవగాహన ఉండదు. అతిగా తాగడం వల్ల మేలు కంటే కీడే ఎక్కువ జరిగే ప్రమాదం ఉందని ఆయుర్వేద నిపుణులు హెచ్చరిస్తున్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరు ఫోకస్ పెడుతున్నారు. సామాన్యుల నుంచి బాలీవుడ్ సెలబ్రిటీల వరకు అందరూ తమ ఫిట్‌నెస్ మంత్రంగా వివిధ రకాల ఔషధ జలాలను ఆశ్రయిస్తున్నారు. సోంపు నీరు, మెంతుల నీరు, సెలెరీ వాటర్ వంటివి జాబితాలో ఉన్నప్పటికీ.. అందరూ ఎక్కువగా ఇష్టపడేది మాత్రం జీలకర్ర నీరు. అయితే ఇది కేవలం బరువు తగ్గడానికి మాత్రమే కాదు.. దీనిని సరైన పద్ధతిలో తీసుకుంటే అద్భుతమైన ఫలితాలు ఉంటాయని ఆయుర్వేదం చెబుతోంది. జీర్ణక్రియకు అమృతం: ఆయుర్వేదం ప్రకారం జీలకర్ర ఒక గొప్ప వంటింటి ఔషధం. ఇది మందకొడిగా ఉన్న జీర్ణశక్తిని ఉత్తేజపరుస్తుంది. మన శరీరంలోని విషపూరిత పదార్థాలను బయటకు పంపడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఆకలి లేమితో బాధపడేవారికి ఇది గొప్ప ఉపశమనం. అయితే చాలామంది త్వరగా ఫలితం రావాలని రోజంతా ఈ నీటిని సిప్ చేస్తూ ఉంటారు. కానీ అలా చేయడం వల్ల ఆశించిన ప్రయోజనం అందకపోవచ్చు. తయారు చేసే సరైన పద్ధతి: జీలకర్ర నీటిని ఎలా తయారు చేస్తున్నారనే దానిపైనే దాని ఫలితం ఆధారపడి ఉంటుంది. ఒక స్పూన్ జీలకర్రను రాత్రంతా ఒక గ్లాసు నీటిలో నానబెట్టాలి. ఉదయాన్నే ఆ నీటిని బాగా మరిగించాలి. నీరు రంగు మారే వరకు మరిగించడం వల్ల జీలకర్రలోని పోషకాలు నీటిలోకి చేరుతాయి. మరిగించిన నీటిని వడకట్టి, అది గోరువెచ్చగా ఉన్నప్పుడు మాత్రమే తాగాలి. మరీ వేడి నీటిని తాగడం వల్ల మలబద్ధకం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఎప్పుడు తాగితే ఫలితం..?: జీలకర్ర నీటిని తాగడానికి ఉత్తమ సమయం ఉదయం ఖాళీ కడుపుతో తాగడం. ఒకవేళ ఉదయం వీలు పడకపోతే, భోజనం చేసిన తర్వాత చిన్న చిన్న సిప్స్ తీసుకుంటూ తాగవచ్చు. ఇలా చేయడం వల్ల భోజనం తర్వాత కలిగే కడుపు ఉబ్బరం లేదా భారంగా ఉండే సమస్య తగ్గుతుంది. ముఖ్యంగా వేసవి కాలంలో శరీరంలో కలిగే మంటను తగ్గించి, చల్లదనాన్ని ఇవ్వడానికి ఇది బాగా పనిచేస్తుంది.

# అన్ని జబ్బులకీ వెల్‌కమ్ చెబుతున్న కొత్త లోపం




ప్రస్తుత కాలంలో పోషకాహారం గురించి మాట్లాడేటప్పుడు అందరూ ప్రోటీన్, విటమిన్ డి లేదా ఐరన్ గురించి మాత్రమే చర్చిస్తున్నారు. కానీ ప్రపంచవ్యాప్తంగా డెబ్బై ఆరు శాతం మంది ప్రజలు ఒక అత్యంత కీలకమైన పోషక లోపంతో సతమతమవుతున్నారని ఇటీవల వెల్లడైన పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. మన శరీరం తనంతట తానుగా తయారు చేసుకోలేని, కేవలం ఆహారం ద్వారా మాత్రమే అందాల్సిన ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ లోపం ఇప్పుడు ఒక గ్లోబల్ హెల్త్ క్రైసిస్ గా మారుతోంది. కేవలం చేపల నూనె క్యాప్సూల్స్ గురించి మాత్రమే తెలిసిన సామాన్యులకు ఇది ఎంతటి ప్రమాదకరమైన లోపమో తెలియడం లేదు. గత రెండు దశాబ్దాలుగా మన ఆహారపు అలవాట్లలో చోటు చేసుకున్న భారీ మార్పులే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్? లోపానికి ప్రధాన కారణం. పూర్వకాలంలో ప్రజలు చేపలు, గింజలు ఇంకా విత్తనాలను ఎక్కువగా తీసుకునేవారు. కానీ నేటి ఆధునిక జీవనశైలిలో ప్రాసెస్డ్ ఫుడ్స్ ఇంకా రిఫైన్డ్ వెజిటబుల్ ఆయిల్స్ వాడకం విపరీతంగా పెరిగిపోయింది. దీనివల్ల శరీరంలో ఒమేగా 6 స్థాయిలు పెరిగి ఒమేగా 3 స్థాయిలు గణనీయంగా పడిపోయాయి. ఒమేగా 6 నూనెలు శరీరంలో వాపులకు కారణమై దీర్ఘకాలిక వ్యాధులను ప్రేరేపిస్తాయి. ముఖ్యంగా శాఖాహారులు ఇంకా పట్టణ ప్రాంతాల్లో నివసించే పద్దెనిమిది నుండి ఇరవై ఐదు ఏళ్ల లోపు యువతలో ఈ పోషక లోపం ఎక్కువగా కనిపిస్తోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది భవిష్యత్తులో తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉంది. ఈ పోషకం లేకపోవడం వల్ల మెదడు పనితీరు, గుండె ఆరోగ్యం ఇంకా శరీరంలో ఇన్ఫ్లమేషన్ నియంత్రణ దెబ్బతినే అవకాశం ఉంది. శరీరంలో ఒమేగా 3 తక్కువగా ఉన్నప్పుడు కొన్ని లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. చర్మం పొడిబారడం, జుట్టు చిట్లిపోవడం, ఏకాగ్రత దెబ్బతినడం లేదా బ్రెయిన్ ఫాగ్ వంటి సమస్యలు ఎదురవుతాయి. తరచుగా మూడ్ స్వింగ్స్ రావడం, విపరీతమైన అలసట ఇంకా కీళ్లలో అసౌకర్యం కలగడం వంటివి ఈ లోపానికి సంకేతాలు. ఇవి నెమ్మదిగా మొదలవుతాయి కాబట్టి చాలామంది వీటిని సాధారణ అలసటగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ ఈ లక్షణాలు కనిపిస్తున్నాయంటే మీ మెదడు ఇంకా గుండెకు కావాల్సిన ఇంధనం అందడం లేదని అర్థం. మన రోగనిరోధక వ్యవస్థ బలంగా ఉండాలన్నా, మెదడు చురుకుగా పనిచేయాలన్నా ఈ ఫ్యాటీ యాసిడ్స్ ఉండటం తప్పనిసరి. ఇవి మన మెటబాలిక్ ఫంక్షన్లను కూడా ప్రభావితం చేస్తాయి. ఈ లోపాన్ని అధిగమించడానికి మన రోజువారీ ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవాలని బెంగళూరులోని కిమ్స్ హాస్పిటల్ డైటెటిక్స్ విభాగం నిపుణులు సూచిస్తున్నారు. వారానికి రెండు సార్లు సాల్మన్, సార్డినెస్ లేదా మాకేరెల్ వంటి ఫ్యాటీ ఫిష్ తీసుకోవడం ఉత్తమం. శాఖాహారులు అయితే అవిసె గింజలు, చియా విత్తనాలు, వాల్ నట్స్ ఇంకా బ్రెజిల్ నట్స్ ను ఆహారంలో భాగం చేసుకోవాలి. అవకాడో, సోయా ఉత్పత్తులు ఇంకా కానోలా ఆయిల్ వాడటం వల్ల కూడా ఒమేగా 3 అందుతుంది. అవసరమైతే వైద్యుల సలహాతో సప్లిమెంట్లను కూడా వాడవచ్చు. ఈ పోషకాలు కేవలం ఒక ట్రెండ్ మాత్రమే కాదు, ఇవి గుండె ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచే ఒక బలమైన పునాది వంటివి.

# అలసటను తగ్గించడానికి ఏ విటమిన్ సహాయపడుతుంది?

చాలా మంది తరచుగా తీవ్రమైన అలసటను అనుభవిస్తారు.. దీనిని సాధారణమైనదిగా కొట్టిపారేయకూడదు. దీని వెనుక ప్రధాన కారణం విటమిన్ లోపం కావచ్చు. ఈ రోజుల్లో, చాలా మంది రోజంతా పెద్దగా పని చేయకపోయినా అలసటగా భావిస్తున్నారు. శక్తి లేకపోవడం, నీరసం, నిస్సత్తువ దీనికి సంకేతాలు కావచ్చు. కొన్నిసార్లు, ఇది కేవలం నిద్రలేమి మాత్రమే కాదు.. అవసరమైన విటమిన్ల లోపం కూడా ఒక కారణం. అలసట సాధారణ లక్షణాలలో ఎల్లప్పుడూ నీరసంగా అనిపించడం, పనిపై ఆసక్తి లేకపోవడం, తల తిరగడం, కండరాల నొప్పి, ఏకాగ్రత లోపం, త్వరగా అలసిపోవడం వంటివి ఉంటాయి. కొంతమందికి ఆయాసం, గుండె వేగంగా కొట్టుకోవడం లేదా మెట్లు ఎక్కేటప్పుడు తల బరువుగా అనిపించడం వంటివి కూడా అనుభవమవుతాయి. కొన్నిసార్లు, దృష్టి మసకబారడం లేదా తరచుగా పడుకోవాలనిపించడం కూడా అలసటకు సంకేతాలు కావచ్చు. ఈ లక్షణాలు ఎక్కువ కాలం కొనసాగితే, వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. శరీరానికి సరైన పోషకాహారం అందకపోతే ఈ సమస్య మరింత తీవ్రమవుతుంది. అందువల్ల, కారణాన్ని అర్థం చేసుకుని, సకాలంలో తగిన చర్యలు తీసుకోవడం ముఖ్యం. లేడీ హార్డింగ్ హాస్పిటల్‌లోని వైద్య విభాగం డైరెక్టర్, హెచ్‌ఓడి అయిన డాక్టర్ ఎల్. హెచ్. ఘోటేకర్.. అలసటను తగ్గించడానికి విటమిన్ బి12 చాలా ముఖ్యమైనదని వివరిస్తున్నారు. ఈ విటమిన్ శరీరం ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేయడానికి, నాడీ వ్యవస్థ సరైన పనితీరును నిర్వహించడానికి సహాయపడుతుంది. శరీరంలో విటమిన్ బి12 లోపించినప్పుడు, ఒక వ్యక్తి బలహీనత, తల తిరగడం, నిరంతర అలసటను అనుభవించవచ్చు. అదనంగా, ఈ విటమిన్ శరీర శక్తి ఉత్పత్తి ప్రక్రియకు తోడ్పడుతుంది.



దీని లోపం శరీరానికి ఆక్సిజన్ సరఫరాను ప్రభావితం చేసి, అలసటకు దారితీస్తుంది. అందువల్ల, ఎవరైనా నిరంతర అలసటతో బాధపడుతుంటే, వారి విటమిన్ బి12 స్థాయిలను పరీక్షించుకోవడం అవసరం కావచ్చు. విటమిన్ బి12 అవసరాలను తీర్చడానికి సరైన ఆహారం చాలా అవసరం. పాలు, పెరుగు, జున్ను, గుడ్లు, చేపలు మాంసం వంటి ఆహారాలను మీ ఆహారంలో చేర్చుకోవచ్చు. శాకాహారులకు ఫోర్టిఫైడ్ ఆహారాలు ఒక మంచి ఎంపికగా ఉంటాయి. కొన్ని సందర్భాల్లో, వైద్యులు విటమిన్ బి12 సప్లిమెంట్లు లేదా ఇంజెక్షన్లను సిఫార్సు చేయవచ్చు. అయితే, వైద్యుడిని సంప్రదించకుండా సప్లిమెంట్లు తీసుకోవడం మంచిది కాదు. సమతుల్య ఆహారం ద్వారా సహజంగా శరీరానికి ఈ విటమిన్‌ను అందించడమే అత్యంత సురక్షితమైన, ప్రభావవంతమైన మార్గంగా పరిగణించబడుతుంది.

## వంటకాలు తాజాగా ఉండాలంటే

# ఈ జాగ్రత్తలు తీసుకోండి



ఎండలు ముదురుతున్న కొద్దీ మన చుట్టూ ఉన్న వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తాయి. వేసవిలో కేవలం దాహం ఇంకా అలసట మాత్రమే కాదు ఆహారం నిల్వ చేయడం కూడా ఒక పెద్ద సవాలుగా మారుతుంది. అధిక ఉష్ణోగ్రతలు ఇంకా తేమ కారణంగా మనం తినే పదార్థాల్లో బ్యాక్టీరియా శరవేగంగా వృద్ధి చెందుతుంది. దీనివల్ల ఆహారం చాలా త్వరగా పాడైపోయి విషపూరితంగా మారుతుంది. పర్యవసానంగా ఫుడ్ పాయిజనింగ్, డయేరియా వంటి తీవ్రమైన జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. ఈ ప్రమాదకర పరిస్థితుల నుండి మనల్ని మనం కాపాడుకోవాలంటే వంటింట్లో మనం చేసే పనుల పట్ల ఎంతో అప్రమత్తంగా ఉండాలి. సాధారణంగా వేసవి కాలంలో వాతావరణంలోని వేడి వల్ల ఆహారంలోని కొవ్వులు విచ్ఛిన్నమై దుర్వాసన వస్తుంటాయి. ముఖ్యంగా పాలు, పప్పులు ఇంకా మాంసం వంటి ప్రోటీన్ అధికంగా ఉండే పదార్థాలపై బ్యాక్టీరియా ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. ఆహారాన్ని ఎక్కువ సేపు బయట ఉంచి ఆ తర్వాత ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల కూడా అది త్వరగా పాడవుతుంది. అందుకే రిఫ్రిజిరేటర్ ఉష్ణోగ్రతను ఎప్పుడూ 1 నుండి 4 డిగ్రీల సెల్సియస్ వద్ద ఉండేలా చూసుకోవాలి. వండిన ఆహారాన్ని రెండు గంటలలోపు ఫ్రిజ్‌లో పెట్టడం మంచిది. అయితే వేడి వేడి పదార్థాలను నేరుగా ఫ్రిజ్‌లో పెట్టకుండా గది ఉష్ణోగ్రతకు వచ్చే వరకు చల్లారనివ్వాలి. లేదంటే ఫ్రిజ్ లోపల ఉష్ణోగ్రత పెరిగి ఇతర వస్తువులు కూడా పాడయ్యే అవకాశం ఉంది. చాలామంది చేసే పొరపాటు ఏంటంటే.. బంగాళాదుంపలు, ఉల్లిపాయలు ఇంకా వెల్లుల్లిని ఫ్రిజ్‌లో పెట్టడం. నిజానికి వీటిని ఫ్రిజ్‌లో పెడితే తేమ వల్ల అవి త్వరగా కుళ్ళిపోతాయి. వీటిని ఎప్పుడూ గాలి తగిలే పొడి ప్రదేశంలోనే నిల్వ చేయాలి. అలాగే ఫ్రిజ్‌ను వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవడం చాలా అవసరం. మురికిగా ఉన్న ఫ్రిజ్ బ్యాక్టీరియా వృద్ధికి కేంద్రంగా మారుతుంది. ఆహారాన్ని నిల్వ చేసేటప్పుడు ఎప్పుడూ గాలి చొరబడని డబ్బాలను మాత్రమే వాడాలి. పాత ఆహార పదార్థాలను కొత్తగా వండిన వాటితో కలపడం వల్ల కూడా ఇన్ఫెక్షన్లు త్వరగా వ్యాపిస్తాయి. కాబట్టి తాజాగా ఉన్నవాటిని విడిగా ఉంచడమే క్షేమం. పండ్లు ఇంకా కూరగాయల విషయంలో మరిన్ని జాగ్రత్తలు అవసరం. ఆకుకూరలను కడిగి బాగా ఆరబెట్టిన తర్వాత పేపర్ టవల్‌లో చుట్టి నిల్వ చేస్తే ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి. కోసిన పండ్లను వెంటనే తినేయాలి లేదా గాలి చొరబడని డబ్బాలో పెట్టి ఫ్రిజ్‌లో ఉంచాలి. ఇక మాంసాహారం విషయానికి వస్తే మాంసం, చేపలు ఇంకా గుడ్లను ఇతర వంటకాలతో కలవకుండా విడివిడిగా భద్రపరచాలి. వేసవిలో వండని మాంసం నుండి వెలువడే బ్యాక్టీరియా వండిన పదార్థాలకు సోకకుండా చూసుకోవడం అత్యంత కీలకం. ఇది ఆహారం కలుషితం కాకుండా కాపాడుతుంది.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు

**నిజామాబాద్ :** రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అరైవ్ అలైవ్ పేరుతో రాష్ట్ర వ్యాప్తం గా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు నిజామాబాద్ నగర పర్యటనకు బుధవారం విచ్చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం మూడు గంటల సమయంలో నిజామాబాద్ చేరుకున్న మంత్రిని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం హెలిప్యాడ్ వద్ద కలెక్టర్, పోలీస్ కమిషనర్ తో పాటు అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, ఇతర జిల్లా అధికారులు పుష్ప గుచ్చాలు అందించి స్వాగతం పలికారు. అక్కడి నుండి పోలీసు బందోబస్తు మధ్య కాన్వాయ్ ద్వారా మంత్రి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్దకు చేరుకున్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కోసం చేపట్టిన బైక్ ర్యాలీని జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ర్యాలీ కంటేశ్వర్ బైపాస్ చౌరస్తా వరకు చేరుకోగా, అక్కడ విద్యార్థులతో కలిసి మానవహారంగా ఏర్పడ్డారు. జిల్లా అధికారులతో పాటు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ తదితరులు మానవహారంలో భాగస్వాములు అయ్యారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేస్తామని, ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. అతివేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. తద్వారా అనేక కుటుంబాలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు. ఎన్ని చట్టాలు నిబంధనలు అమలు చేసినా, ప్రజలలో మార్పు రానంత వరకు ప్రమాదాలను నిలువరించడం సాధ్యం కాదని అన్నారు. దీనిని గుర్తిస్తూ పోలీస్ రవాణా శాఖల ఆధ్వర్యంలో ప్రజలలో అవగాహన కల్పించడం కోసం అరైవ్ అలైవ్ పేరుతో ప్రభుత్వం విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తోందని గుర్తు చేశారు. అన్ని వర్గాల వారు ఈ కార్యక్రమాల్లో పాల్గొని ప్రమాదాల నివారణకు తమవంతు దోహదపడాలని పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాలలో గాయపడిన క్షతగాత్రులను తక్షణమే స్పందించి ఆసుపత్రికి తరలించాలని, అలా కృషి చేసిన వారిని రహ్ వీర్ కింద రూ. 25 వేల నగదు ప్రోత్సాహకం ప్రభుత్వం ద్వారా అందజేయబడుతుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా నిబంధనలు పాటిస్తూ, ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. ఈ కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# రేవంత్‌కు కేటీఆర్ మద్దతు





**హైదరాబాద్ :** రిజర్వేషన్ బిల్లుకు మద్దతిస్తామన్న కేటీఆర్ నియోజకవర్గాల పునర్విభజన బిల్లులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే కేసీఆర్ ముందుండి ఉద్యమాన్ని నడిపిస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. డీలిమిటేషన్ బిల్లు పేరుతో మనకు అన్యాయం జరిగితే కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమం మొదలవుతుందని హెచ్చరించారు. పార్లమెంటులో ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల వాటా 24 శాతంగా ఉందని, డీలిమిటేషన్ తర్వాత ఇది అలాగే ఉండాలని అన్నారు.బీజేపీ పార్టీ తెలంగాణకు ఎప్పుడూ మంచి చేయదని విమర్శించారు. అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు సీట్లను 50 శాతం పెంచుతామని కిషన్ రెడ్డి చెబుతున్నారని, కానీ డీలిమిటేషన్ బిల్లులో ఆ అంశమే లేదని అన్నారు. కిషన్ రెడ్డి చెప్పిన ప్రకారం అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 179కి, 17 లోక్ సభ స్థానాలకు 26 పెరుగుతాయని చెప్పారని తెలిపారు. కానీ బిల్లులో ఈ పెరుగుదల లేదని అన్నారు.బీజేపీ ఎప్పుడూ తెలంగాణకు మిత్రుడు కాదని విమర్శించారు. 2014 ఏపీ పునర్విభజన బిల్లులోనే సీట్ల పెంపు హామీ ఉందని గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ హామీని నెరవేర్చలేదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ అనుకూలమేనని, కానీ డీలిమిటేషన్ బిల్లులో మా త్రం తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.
పోరాటం తప్పదన్న కేసీఆర్ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. ఎర్రవెల్లిలోని తన నివాసంలో పార్టీ సీనియర్ నాయకులు కేటీఆర్, హరీశ్ రావులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దేశ, రాష్ట్ర రాజకీయాలపై వారి మధ్య చర్చ జరిగింది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని, కానీ నియోజకవర్గాల పునర్విభజన బిల్లు విషయానికి వస్తే మాత్రం దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని అన్నారు.చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు తెలుపుతుందని కేసీఆర్ ప్రకటించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే అసెంబ్లీలో మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం తీర్మానం చేశామని గుర్తు చేశారు. ఈ బిల్లుకు రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు పలుకుతారని తెలిపారు. అదే సమయంలో నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా బిల్లు ఉంటే అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం లోక్ సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం సీట్లు ఉన్నాయని గుర్తు చేశారు. పునర్విభజన తర్వాత ఈ శాతం ఏమాత్రం తగ్గకూడదని సూచించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ జరిగితే జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు. బిల్లులోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై పార్టీ తుది నిర్ణయం తీసుకుంటుందని కేసీఆర్ తెలిపారు. అంతవరకు మనం తొందరపడకూడదని పార్టీ నాయకులకు సూచించారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న బహిరంగ సభ, ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

# రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరి





**కరీంనగర్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా బుధవారం కరీంనగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్థానిక శాతవాహన యూనివర్సిటీలో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ, మున్సిపల్, మరియు రవాణా శాఖల సమన్వయంతో నిర్వహిస్తున్న ఈ రోడ్డు భద్రతా వారోత్సవాల 3వ రోజు కార్యక్రమానికి జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అవగాహనతోనే ప్రమాదాల నివారణ: సిపి గౌస్ ఆలంఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ. ఈ నెల 13 నుండి 18 వరకు కమిషనరేట్ వ్యాప్తంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం యువతే ప్రాణాలు కోల్పోవడం ఆందోళనకరమని, దీనిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ 'డిఫెన్సివ్ డ్రైవింగ్' అలవాటు చేసుకోవాలని సూచించారు. ముఖ్య అంశాలు:మానవ తప్పిదాలే కారణం హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, అపసవ్య మార్గాల్లో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. గణాంకాలు: జిల్లాలో గతేడాది 200 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించగా, అందులో ద్విచక్ర వాహనదారులే ఎక్కువ. పోలీసుల కఠిన చర్యల వల్ల ప్రమాదాల రేటు 17 శాతం తగ్గింది.ప్రభుత్వ ప్రోత్సాహం ఈ పథకం కింద ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో రూ.1.5 లక్షల వరకు ఉచిత నగదు రహిత చికిత్స అందుబాటులో ఉంది. హిట్ అండ్ రన్ బాధితులకు కూడా ఆర్థిక సాయం అందుతుంది.రహ వీర్ పథకం: ప్రమాదం జరిగిన 'గోల్డెన్ అవర్'లో బాధితులను ఆసుపత్రికి చేర్చిన వారికి ప్రభుత్వం రూ. 25 వేల బహుమతి అందజేస్తుంది.అనంతరం విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలు మరియు ర్యాగింగ్ నిరోధక చట్టాలపై సిపి అవగాహన కల్పించారు.డ్రగ్ ఫ్రీ యూనివర్సిటీగా శాతవాహన వీసీ ఉమేష్ కుమార్,యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ యు. ఉమేష్ కుమార్ మాట్లాడుతూ. తమ విద్యాలయ ప్రాంగణం డ్రగ్ ఫ్రీగా ఉందని, ర్యాగింగ్ నిరోధానికి ప్రత్యేక కమిటీ పనిచేస్తోందని తెలిపారు. వాహనాల వేగాన్ని నియంత్రించేం దుకు క్యాంపస్ అంతటా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.ప్రతిజ్ఞ మరియు హెల్మెట్ల పంపిణీ:కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామ ని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పలువురు విద్యార్థులకు యూనివర్సిటీ వీసీ ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కొత్తపల్లి స్టేషన్ అధికారి ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, రిజిస్ట్రార్ సతీష్ కుమార్ మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓయూలో ఏబీవీపీ నిరసన

**హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు వినూత్నంగా నిరసన చేపట్టారు. స్కాలర్షిప్స్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు జీవన్ మాట్లాడుతూ తాము దారిద్ర్యరేఖకు దిగువనున్న పేద, మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాలకు చెందినవారమని, మెరిట్ ఆధారంగా ఉన్నత విద్యను అభ్యసిస్తున్నామని తెలిపారు. గత నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రంలో దాదాపు పదివేల కోట్ల రూపాయల స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పెండింగ్లో ఉన్నాయని, దాంతో సుమారు 22 లక్షల నుండి 25 లక్షల మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కాలర్షిప్స్ విడుదల కాకపోవడంతో చాలా మంది విద్యార్థులు కుటుంబ ఆభరణాలు తాకట్టు పెట్టి ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను చెల్లించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమం

**విద్యార్థులతో మానవహారం, రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ మరియు అవగాహన**

**జిల్లా ఎస్పీ డి.జానికి,**

**మహబూబ్ నగర్ :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, మహబూబ్నగర్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం ప్రభుత్వ పాఠశాల, పోలీస్ లైన్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి, విద్యార్థులతో కలిసి మానవహారం (ఊబీఎజీని అష్ట్రజీతిని) ఏర్పాటు చేసి, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు ప్రధానంగా నిర్లక్ష్యం, అధిక వేగం మరియు ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వల్ల జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగించడం, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. అలాగే చిన్న వయస్సు నుండే విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని, వారు బాధ్యత గల పౌరులుగా ఎదగాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఇక్కడ తెలుసుకున్న రోడ్డు భద్రత నియమాలను తమ ఇళ్లలో తల్లిదండ్రులకు కూడా తెలియజేసి, వారితో చర్చించి, తూచా తప్పకుండా పాటించేలా ప్రోత్సహించాలని జిల్లా ఎస్పీ సూచించారు.

## కొండాపూర్ మసీద్బండ చౌరస్తాలో భారీగా గంజాయి చాక్లెట్ల పట్టివేత..

సెక్యూరిటీ గార్డు అరెస్ట్..

**హైదరాబాద్ :** గచ్చిబౌలి పోలీసులు మరియు శేరిలింగంపల్లి ఎస్ఓటి (రాజు) బృందం సంయుక్తంగా బీహార్కు చెందిన ప్రేమ్ ప్రకాష్ చౌదరి (43) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు..నిందితుడు స్థానిక ఎస్ఎంఆర్ వినయ్ (రాఓఖీ ఎతినిజీఎ) అపార్ట్మెంట్లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. నిందితుడి నుంచి 1227 గ్రాముల గంజాయి చాక్లెట్లు మరియు 147 గ్రాముల ఎండు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం నిర్వహించే సభలను విజయవంతం చేయాలి

**సిద్దిపేట :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం నిర్వహించే సభలను విజయవంతం చేయాలనిజిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. బుదవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హల్ లో ఏప్రిల్ 16 తేదీన నిర్వహించే మండల సభ ఏర్పాట్ల గురించి అందరూ జిల్లా అధికారులు, మండల స్థాయిలో ఎంపిడిఓ, తహసిల్దార్, ఏంఈఓ, మెడికల్ ఆఫీసర్, అగ్రికల్చర్, హౌసింగ్ పంచాయతీ రాజ్ ఏఈలు, ఏపిఎం, ఐసిడిసి ఇతర శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ జూమ్ సమావేశం ద్వారా దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రక్రియలో ఏప్రిల్ 2 న గ్రామసభలను విజయవంతం చేశారని అలాగే ఏప్రిల్ 16 వ తేదీన మండల సభల నిర్వహణ ఏర్పాట్లు సైతం పగడ్బందిగా చెయ్యాలని తెలిపారు. మండల సభల ఏర్పాట్లు, నిర్వహణ పూర్తి బాధ్యత ఎంపీడీఓ లదే మండల వివిధ శాఖల అధికారులందరితో కో-ఆర్డినేట్ చేసుకుని ప్రభుత్వ పథకాల అమలు గూర్చి మండల స్థాయిలో మంచి పోటో ఎక్సిబిషన్ ఏర్పాటు చెయ్యాలని తెలిపారు.ప్రభుత్వం 99 రోజుల కార్యక్రమంలో ఒక్కో వారం ఒక్కో థీమ్ కి కేటాయించారు. ఈ వారం థీమ్ అరైవ్- అలైవ్ గూర్చి రవాణా, పోలీస్ అధికారులతో ప్రతిజ్ఞ మరియు థీమ్ యొక్క ఉద్దేశం గూర్చి సభలో చర్చించాలని ఆదేశించారు.ఈ మండల సభల గురించి స్థానిక ఏంపి, ఏంఎల్ఎ, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మండల ప్రజాప్రతినిధులను, అధికారులకు ఆహ్వానం అందించాలి.జిల్లా అధికారులు మీకు కేటాయించిన మండలాల్లో మండల సభలు నిర్వహణ ఏర్పాట్ల గూర్చి ఈ రోజు ముందస్తు సమావేశాలు నిర్వహించాలనీ ఆదేశించారు.ప్రభుత్వ పథకాలు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల, గృహలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరా మహిళ శక్తి బ్యాంక్ లింకేజి, వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ చీరలు పంపిణీ, ఎన్ ఆర్ ఈ జీ ఎస్ లో చేపట్టిన పనులు, సన్నబియ్యం పంపిణీ, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, సన్న వడ్లకు బోనస్, రైతు భరోసా, రైతు రుణమాఫీ సంబంధించిన పూర్తి సమాచారాన్ని లబ్ధిదారుల నంబర్ మరియు ప్రభుత్వం అందజేసిన నిధుల గురించి తెలపాలి. అలాగే ప్రభుత్వ పథకాల అమలు గూర్చి స్టాల్ లను ఏర్పాటు చేసుకోవాలి.అలాగే నాచురల్ ఆర్గానిక్ ఫామింగ్ గూర్చి మీ మండలంలో ట్రైనింగ్ ఇచ్చిన అధికారులను వారిని పిలుచుకుని సభలో దాని గూర్చి ప్రజలకు తెలపాలని, అలాగే పంట మార్పిడి గురించి తెలియజేయాలని ఆదేశించారు. మండల కేంద్రాల్లో అనుకూలమైన ప్రదేశంలో సిట్టింగ్ అరేంజ్మెంట్, ఆడియో మైక్ సిస్టమ్, డ్రింకింగ్ వాటర్, బ్యానర్స్ లు ఏర్పాట్లు, పబ్లిసిటీ మెటీరియల్ జిల్లా అధికారులు అందజేస్తారని తెలిపారు.ఈ సభలో 16 వ తేదీన ఉదయం 10 గంటలకు సభ మొదలు పెట్టాలని, ఎజెండా ఐటమ్స్ వెల్ కం అడ్రస్, తెలంగాణ గీతం, వివిధ పథకాల అమలు గూర్చి ఆయా మండల అధికారులు బ్రీఫ్ గా మాట్లాడాలి. మీరు చేసిన ప్రోగ్రామ్ గురించి మొత్తం ప్రక్రియ డాక్యుమెంట్ చెయ్యాలని ఆదేశించారు.జూన్ 2 నుండి ప్రభుత్వం అమలు చేయబోయే కొత్త పథకాల గూర్చి మీ ద్వారా ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు.ఏప్రిల్ 2 రోజున తీసుకున్న పలువురు అందజేసిన ఫిటిషన్ లను వెరిఫై చేసి వాటిని పరిగణనలోకి తీసుకొని వెరిఫై చెయ్యాలని ఆదేశించారు. అలాగే మండల సభల్లో ప్రజలు ఏదైనా పిటిషన్లు ఇచ్చిన స్వీకరించి పరిష్కరించాలని ఆదేశించారు.ఈ మండల సభలను మండల స్థాయి అధికారులు అందరూ సమన్వయంతో ఒక పండుగ వాతావరణంలో విజయవంతంగా జరపాలని ఆదేశించారు.

## డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కాలని చూస్తే సహించేది లేదు

**ఆషాఢం సేల్ లెక్క అడ్డగోలు హామీలు ఇచ్చుకుంటూ పోయారు**

**మేడ్చల్ :** మేడ్చల్ జిల్లా, పీర్జాదిగూడలో పలువురు కాంగ్రెస్ పార్టీ నుంచి మున్సిపల్ కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీలో చేరే కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడూ పీర్జాదిగూడ నాయకులకు అభినం దనలు. లోక్ సభ, శాసనసభ సీట్ల పెంపుపై కేంద్ర ప్రభుత్వం చెప్పింది ఒక్కటి, చేసేది ఒక్కటి. డీలిమిటేషన్ పేరుతో బీజేపీ మరో కొత్త కుట్రకు తెరలేపుతోంది. మహిళలకు మేము స్థానికంగా ఉన్న మార్కెట్ కమిటీలలో 50శాతం రిజర్వేషన్లు ఇచ్చాం. మహిళా రిజర్వేషన్ గురించి మేము శాసనసభలో కూడా తీర్మానం చేశాం. డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కాలని చూస్తే సహించేది లేదని అన్నారు. ఇవాళ దక్షిణాది రాష్ట్రాలకు డీలిమిటేషన్ లో అన్యాయం జరిగితే.. కేసీఆర్ అధ్వర్యంలో పోరాటం చేస్తాం. కేసీఆర్ స్వయంగా నాయకత్వం వహిస్తారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోనే ఉన్నది. అయినా దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు . మన బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నర యేండ్ల కాలం అయింది. ఎన్నికల ముందు అడ్డగోలుగా అనేక హామీలు ఇచ్చారు. పెద్ద పెద్ద మాటలు చెప్పి అడ్డం పొడుగు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారు.

# బిజినెస్

## గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి ఆరు రెట్లు పెరిగిన పెట్టుబడులు




పసిడి ధరలతో పాటు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యం లో ఇన్వెస్టర్లు సంప్రదాయ 'సురక్షిత ఆస్తి' బంగారంలో పెట్టుబడులకు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. గతేడాదితో పోలిస్తే 2026, మార్చి త్రైమాసికంలో గోల్డ్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు ఏకంగా 6 రెట్లు పెరగడమే దీనికి సాక్ష్యం. ముఖ్యంగా బంగారం ధరలు ఊహించని విధంగా రికార్డు గరిష్ఠాలకు చేరడంతో చిన్న మొత్తం గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెట్ ఫండ్ల (గోల్డ్ ఈటీఎఫ్‌లు) కొనుగోళ్లు అత్యంత వేగంగా పెరిగాయి. మార్చితో ముగిసిన త్రైమాసికంలో గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి మొత్తం రూ. 31,561 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది గతేడాది మార్చి త్రైమాసికంలో వచ్చిన రూ. 5,654 కోట్ల కంటే దాదాపు ఆరు రెట్లు అధికం. త్రైమాసిక పరంగా కూడా అంతకుముందు డిసెంబర్ త్రైమాసికంలో రూ. 23,132 కోట్ల కంటే 36 శాతం పెరిగాయని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ (యాంఫీ) పేర్కొంది. గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి పెట్టుబడులు పెరగడంతో గోల్డ్ ఫండ్ల ఆస్తులు గతేడాది రూ. 58,888 కోట్ల నుంచి మూడు రెట్లు పెరిగి రూ. 1.71 లక్షల కోట్లకు చేరింది.

## ఆర్థిక వ్యవస్థకు చమురు సెగ



పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఎస్అండ్‌పి గ్లోబల్ రేటింగ్స్ హెచ్చరించింది. ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరగడం భారత్‌కు పెను సవాలుగా మారనుందని ఈ నివేదికలో విశ్లేషించింది. ఒకవేళ 2026లో ముడిచమురు సగటు ధర బ్యారెల్‌కు 130 డాలర్ల మార్కును తాకితే.. భారత ఆర్థిక వృద్ధి రేటు ఏకంగా 80 బేసిస్ పాయింట్లు లేదా 0.80 శాతం మేర పడిపోయే ప్రమాదం ఉందని సంస్థ అంచనా వేసింది. పశ్చిమాసియా సెగ కేవలం ఇంధన ధరలకే పరిమితం కాకుండా సరఫరా గొలుసులో అంతరాయాల ద్వారా గృహాలు, కార్పొరేట్ సంస్థలు, బ్యాంకింగ్ రంగంపై కూడా ఒత్తిడి పెంచుతుందని ఎస్అండ్‌పి హెచ్చరించింది. ఈ చమురు షాక్ ప్రభావంతో 2026–27 ఆర్థిక సంవత్సరంలో భారత కార్పొరేట్ రంగం భారీ నష్టాలను చవిచూడాల్సి రావచ్చు. ప్రధానంగా కంపెనీల నిర్వహణ లాభాలు 15 నుంచి 25 శాతం వరకు క్షీణించే అవకాశం ఉందని.. దీంతో సంస్థల రుణ భారం పెరిగి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతాయని ఎస్అండ్‌పి విశ్లేషించింది. బ్యాంకింగ్ రంగం విషయానికి వస్తే ఆస్తుల నాణ్యత తగ్గి మొండి బకాయిలు 3.5 శాతానికి చేరవచ్చని అంచనా వేసింది. ముఖ్యంగా రసాయన, రిఫైనింగ్, ఏవియేషన్ రంగాలు ఈ ధరల పెరుగుదల వల్ల నేరుగా దెబ్బతినే అవకాశం ఉంది. పెరిగిన దిగుమతి ఖర్చుల వల్ల కరెంట్ అకౌంట్ లోటు పెరగడమే కాకుండా రూపాయి విలువపై కూడా క్షీణత ఒత్తిడి పెరుగుతుందని నివేదిక పేర్కొంది. యుద్ధ తీవ్రత తగ్గి హార్ముజ్ జలసంధి వంటి కీలక మార్గాల్లో రవాణా సాధారణ స్థితికి చేరుకుంటే 2027 నాటికి ఆర్థిక వ్యవస్థ మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని పేర్కొంది.

# ఆటోకు వార్ దెబ్బ

## దేశీయ పరిశ్రమకు సవాళ్లేనంటున్న సియామ్



పశ్చిమాసియాను కుదిపేస్తున్న అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో దేశీయ ఆటోమోటివ్ పరిశ్రమకు తీవ్ర ఇబ్బందులే ఎదురుకావచ్చని మంగళవారం భారతీయ ఆటోమొబైల్ తయారీదారుల సమాజం (సియామ్) అధ్యక్షుడు శైలేష్ చంద్ర అన్నారు. వాహనాల డిమాండ్‌పై పరోక్ష ప్రభావం ఉండొచ్చని 2025–26 ఆర్థిక సంవత్సరం ముగిసిన నేపథ్యంలో ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ అభిప్రాయపడ్డారు. 'మిడిల్ ఈస్ట్ సంక్షోభం నుంచి తలెత్తిన అనిశ్చిత పరిస్థితులను నిశితంగా గమనించాల్సిన అవసరం ఉన్నది. ప్రస్తుత భౌగోళిక, రాజకీయ పరిస్థితులను చూస్తే.. ఆటోమోటివ్ ఉత్పాదకత చిక్కుల్లో పడవచ్చు. విడిభాగాల ధరలు, ఇంధన చార్జీలు, రవాణా ఖర్చులు సమీప కాలంలో ఆటో ఇండస్ట్రీకి సవాల్‌గా మారగలవనిపిస్తున్నది' అని చెప్పారు. గల్ఫ్ వార్‌తో భారతీయ ఆటో ఇండస్ట్రీకి ముడి సరుకుల కొరత రావచ్చని శైలేష్ హెచ్చరించారు. ముఖ్యంగా పెట్రో కెమికల్స్ తయారీలో వినియోగించే ప్రొపేన్, ఇథిలీన్ సరఫరాలో సమస్యలు ఏర్పడవచ్చని, అలాగే వాహనాలకు వేసే రంగుల తయారీ కూడా చిక్కుల్లో పడవచ్చన్నారు. తద్వారా మార్కెట్‌లో వాహనాల డిమాండ్ ప్రభావితం కావచ్చని పేర్కొన్నారు. వార్‌లో అమెరికా–ఇజ్రాయెల్‌కు మద్దతిస్తున్నారని పొరుగు దేశాలపై ఇరాన్ దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఆయా దేశాల్లో ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తికి దాదాపుగా బ్రేకులుపడ్డాయి. అంతేగాక గల్ఫ్ దేశాల నుంచి భారత్ సహా ఇతర దేశాలకు జరిగే రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ ఇంచుమించుగా మూసివేయడంతో నౌకాయానం సమస్యల్లో పడింది. చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొనడంతో దూరం పెరిగి రవాణా సమయం, వ్యయం మితిమీరిపోతున్నదని శైలేష్ అంటున్నారు. అలాగే షిప్పింగ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలూ పెరిగిపోతున్నాయి. అంతిమంగా దిగుమతిదారులపైనే ఈ భారం పడుతుండగా.. ఇది ఆయా ఉత్పత్తుల ధరల పెరుగులకు దారితీస్తున్నది. ఈ క్రమంలోనే రాబోయే 4–5 వారాల్లో ఆయా కంపెనీలు వివిధ వాహనాల ధరల్ని పెంచే అవకాశాలూ లేకపోలేదని వ్యాఖ్యానించారు. ఇప్పటికే పలు సంస్థలు ఆయా మాడళ్ల రేట్లను పెంచిన సంగతి విదితమే. కాగా, పెరిగే పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ తదితర ఇంధన ధరలతోనూ వాహనాల అమ్మకాలు పడిపోవచ్చన్న ఆందోళన ఇండస్ట్రీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నది.

## ఇరాన్ యుద్ధం వల్ల భారత్‌లో 25 లక్షల మంది పేదరికంలోకి



పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారత్‌పైన మరింత ప్రభావం చూపనున్నాయి. ఈ పరిణామాల వల్ల మనదేశంలో 25 లక్షల మంది ప్రజలు పేదరికంలోకి జారిపోయే ప్రమాదం ఉందని, అలాగే మానవ అభివృద్ధి పురోగతిలో దేశం కొంత నష్టాన్ని చూడక తప్పదని ఐక్యరాజ్యసమితి అంచనాలు వెల్లడిస్తున్నాయి. 'మధ్యప్రాచ్యం లో సైనిక ఉద్రిక్తతలు: ఆసియా, పసిఫిక్ ప్రాంత మానవ అభివృద్ధిపై ప్రభావాలు' అనే శీర్షికతో ఐక్యరాజ్యసమితి డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (యూఎన్‌డీపీ) విడుదల చేసిన నివేదికలో.. ఈ యుద్ధం అధిక ఇంధనం, రవాణా, ముడిసరుకుల ఖర్చుల ద్వారా ఆసియా, పసిఫిక్ ప్రాంతమంతటా మానవాభివృద్ధిపై ఒత్తిళ్లను పెంచుతోంది. ఇది దేశంలోని ప్రజల కొనుగోలు శక్తిని, ఆహార భద్రతను తగ్గిస్తోంది. ప్రభుత్వ బడ్జెట్లపై భారం మోపడమే కాకుండా, జీవనోపాధిని బలహీనపరుస్తోందని నివేదిక పేర్కొంది. ఇరాన్ యుద్ధ పరిస్థితుల తర్వాత దేశంలో పేదరికం రేటు 23.9 శాతం నుంచి 24.2 శాతానికి పెరుగుతుందని, దీనివల్ల 24,64,698 మంది ప్రజలు పేదరికంలోకి వెళ్తారని నివేదిక తెలిపింది. సంక్షోభానికి ముందు 35,15,69,000 మంది పేదరికంలో ఉండగా, సంక్షోభం తర్వాత దేశంలో ఈ సంఖ్య సుమారుగా 35,40,33,698కి చేరుతుందని నివేదిక అంచనా వేస్తోంది. మరోవైపు, ఈ యుద్ధ ప్రభావం వల్ల ప్రపంచవ్యాప్తంగా కూడా 88 లక్షల మంది ప్రజలు పేదరికం లోకి జారిపోయే ప్రమాదంలో ఉన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ఆసియా–పసిఫిక్‌కు 299 బిలియన్ డాలర్ల(మన కరెన్సీలో రూ. 27.82 లక్షల కోట్ల) వరకు నష్టం వాటిల్లవచ్చు. చైనాలో పేదరికంలోకి జారిపోయే ప్రమాదంలో ఉన్న వారి సంఖ్య సుమారు 1,15,000 నుంచి 6,20,000కు పైగా పెరుగుతుందని నివేదిక అంచనా వేసింది.

# హాజిల్‌వుడ్ దెబ్బ.. పంత్ అబ్బ!

ఐపీఎల్ 2026 సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్‌లో లక్నో సూపర్‌జెయింట్స్ పేలవ ఆటతీరు ప్రదర్శిస్తోంది. ఆర్సీబీ బౌలర్ల ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోతూ వస్తోంది. ఈ సంగతి పక్కనబెడితే ఆర్సీబీ బౌలర్ జోష్ హాజిల్‌వుడ్ వేసిన బంతి పంత్‌ను గాయపర్చింది. లక్నో ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లో ఇది చోటుచేసుకుంది. 12 పరుగుల చేసి మార్కరమ్ ఔటైన తర్వాత పంత్ క్రీజులోకి వచ్చాడు. ఆ తర్వాత నాలుగో ఓవర్ హాజిల్‌వుడ్ వేశాడు. హాజిల్‌వుడ్ వేసిన తొలి మూడు బంతులను పంత్ జాగ్రత్తగా ఆడాడు. నాలుగో బంతిని పంత్ షాట్ ఆడే ప్రయత్నం చేశాడు. అయితే బంతి మిస్సయ్యి పంత్ ఎడమ మోచేతిని బలంగా తాకింది. బంతి బులెట్‌లా దూసుకురావడంతో దెబ్బకు పంత్ మోచేతి వాచిపోయింది. ఈ సమయంలో పంత్ నొప్పిని తట్టుకోలేక కన్నీళ్లు పెట్టడం కెమెరాలకు చిక్కింది. ఫిజియో వచ్చి పంత్‌ను పరీక్షించాడు. ఆ తర్వాత




రిటైర్డ్ హర్ట్ అయిన పంత్ డగౌట్‌కు వెళ్లిపోతున్న క్రమంలో హాజిల్‌వుడ్‌కు గాయమైన తన మోచేతిని చూపించడం

గమనార్హం. అయితే ఇన్నింగ్స్ 16వ ఓవర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన పంత్ ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. క్రీజులో ఉన్నంత సేపు ఇబ్బందిగా కనిపించిన పంత్ ఆరు బంతులెదుర్కొని ఒక్క పరుగు మాత్రమే చేసి భువనేశ్వర్ బౌలింగ్‌లో సాల్ట్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. గాయం తీవ్రత ఎక్కువగా ఉండడంతో పంత్ తర్వాతి మ్యాచ్ ఆడేది అనుమానమే. మ్యాచ్‌లో లక్నో సూపర్‌జెయింట్స్ 20 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటైంది. మిచెల్ మార్ష్ (40) టాప్ స్కోరర్‌గా నిలవగా.. ముకుల్ చౌదరీ (39), ఆయుశ్ బదోని (38) పర్వాలేదనిపించారు.

# స్పోర్ట్స్

## నా శరీరంలో ఇప్పటికీ ఆ అవశేషాలు

### కుమార సంగక్కర



ఏళ్లు గడిచినా.. ఆ దాడి తాలూకా జ్ఞాపకాలు మాత్రం ప్లేయర్లను వదలడం లేదు. 2009లో పాకిస్థాన్ పర్యటనకు వెళ్లిన శ్రీలంక ప్లేయర్ల బస్‌పై ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. ఆ ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా.. 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో శ్రీలంక ప్లేయర్లూ ఉన్నారు. అప్పట్నుంచి కొన్ని సంవత్సరాలు పాకిస్థాన్‌లో ఆడేందుకు కొన్ని జట్లు విముఖత చూపించాయి. తటస్థ వేదిక పైనే ఆడాల్సిన పరిస్థితి పాక్‌కు ఎదురైంది. ఉగ్రదాడిలో కుమార సంగక్కర, అజంత మెండిస్, తిరంగ, సురంగ, తిలాన్ సమరవీర, తుషారా గాయపడ్డారు. ఆ ఘటనపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో కుమార మాట్లాడాడు. ఇప్పటికీ తన శరీరంలో ఆ ప్రమాదానికి సంబంధించి బాంబు అవశేషాలు ఉన్నట్లు వెల్లడించాడు. "ఆ రోజు (మార్చి 3, 2009) పాక్–శ్రీలంక జట్ల మధ్య టెస్టు థర్డ్ డే. హోటల్ నుంచి గ్రౌండ్‌కు వెళ్లాలని సిద్ధమయ్యాం. మా జట్టులోని ఓ ఫాస్ట్ బౌలర్ 'ఈ ఫ్లాట్ ట్రాక్ దెబ్బకు మా బ్యాక్ బ్రేక్ అవుతోంది.

# సూర్యకు బైబై!.. భారత టీ20 కెప్టెన్.. టాప్-5 ప్లేయర్లు వీరే!

సొంతగడ్డపై టీమిండియాకు ఇటీవల టీ20 ప్రపంచకప్ టైటిల్ అందించిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్. అయితే, అతడి భవితవ్యంపై క్రికెట్ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది. గత కొంతకాలంగా సారథిగా సూపర్ హిట్ అవుతున్నా.. బ్యాటర్‌గా మాత్రం స్థాయికి తగ్గట్లు రాణించలేకపోతున్నాడు. ఈ నేపథ్యంలో సెలక్టర్లు సైతం సూర్యను కొనసాగించాలా వద్దా? అన్న అంశంపై తీవ్రంగా చర్చిస్తున్నట్లు సమాచారం. ఐపీఎల్ ముగిసిన వెంటనే జరిగే ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో సిరీస్‌లలో అతడి ప్రదర్శనను పరిశీలించిన అనంతరమే వారు అంతిమ నిర్ణయానికి రానున్నారు. వచ్చే రెండేళ్లలో ఆస్ట్రేలియా వేదికగా టీ20 ప్రపంచకప్ (2028)తో పాటు లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ (2028) జరగనున్నాయి. వీటికి సూర్యకుమార్ సారథ్యంలోనే సిద్ధం కావాలా లేక కొత్త నాయకుడిని ఎంపిక చేయాలా అనే విషయంపై సెలక్టర్లు ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనతో ఒక అవగాహనకు రానున్నారు.

**విషమ పరీక్ష**

ఈ టూర్‌లో అటు సారథిగా, ఇటు ప్లేయర్‌గా సూర్యకుమార్‌కు విషమ పరీక్ష కానుంది. గౌతమ్ గంభీర్ 2028 ఒలింపిక్స్ వరకు టీమిండియా హెడ్‌కోచ్‌గా కొనసాగే అవకాశాలున్న నేపథ్యంలో... సూర్యకుమార్ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. ప్రస్తుతం 35వ పడిలో ఉన్న సూర్యకుమార్ ఒలింపిక్స్ సమయానికి ఫిట్‌గా ఉంటాడా అనేది అనుమానమే. 'సూర్యకుమార్ ప్రస్తుతం జట్టును నడిపిస్తున్నాడు. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనకు అతడే కెప్టెన్ అందులో ఎలాంటి సందేహం లేదు. అయితే ఆ తర్వాత పరిస్థితి ఏంటి అనేది అందులో అతడి ప్రదర్శనపై ఆధారపడి ఉంటుంది' అని బీసీసీఐ అధికారి తెలిపారు. గతేడాది పేలవ ఆటతీరు కనబర్చిన సూర్యకుమార్ కనీసం ఒక్క హాఫ్‌సెంచరీ కూడా నమోదు చేయలేకపోయాడు. ఈ ఏడాది ఫర్వాలేదనిపించిన ఈ ముంబైకర్... వరల్డ్‌కప్ ఆరంభంలో ఆకట్టుకున్నా... కీలక మ్యాచ్‌ల్లో మాత్రం విఫలమయ్యాడు. సౌతాఫ్రికాపై 18 పరుగులు, వెస్టిండీస్‌పై 18 పరుగులు, ఇంగ్లండ్‌పై 11 పరుగులు చేసిన సూర్యకుమార్... న్యూజిలాండ్‌తో ఫైనల్లో డకౌటయ్యాడు. ఒకవేళ సూర్యను సెలక్టర్లు తప్పిస్తే.. అతడి స్థానంలో టీమిండియా టీ20 కెప్టెన్ కాగల అర్హత ఉన్న టాప్–5 ఆటగాళ్లు ఎవరో తెలుసా?



**శుబ్‌మన్ గిల్**

ఇప్పటికే టీమిండియా టెస్టు, వన్డే పగ్గాలు చేపట్టాడు శుబ్‌మన్ గిల్. అయితే, టీ20 జట్టు కెప్టెన్సీ విషయంలో మాత్రం బీసీసీఐ గిల్ గురించి వెంటనే నిర్ణయం తీసుకోలేకపోవచ్చు. ఆసియా కప్–2025తో టీ20 జట్టులో పునరాగమనం చేసిన అతడు వరుసగా విఫలం కావడం ఇందుకు కారణం. అయితే, ఐపీఎల్–2026లో గనుక బ్యాటర్‌గా గిల్ సత్తా చాటితే అతడి ఎంపిక లాంఛనమే అవుతుంది. కాగా ఫామ్‌లేమి కారణంగా గిల్‌ను టీ20 ప్రపంచకప్–2026 జట్టు నుంచి సెలక్టర్లు తప్పించిన సంగతి తెలిసిందే.

**హార్దిక్ పాండ్యా**

నిజానికి 2024లో టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత రోహిత్ శర్మ అంతర్జాతీయ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పిన తర్వాత కెప్టెన్ కావాల్సింది హార్దిక్ పాండ్యానే. అయితే, అనూహ్యంగా యాజమాన్యం సూర్యకు పగ్గాలు అప్పగించింది.
ఆ సమయంలో.. అరుదైన పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అయిన హార్దిక్ పాండ్యాపై అధిక భారం పడకుండా.. తాము ఈ నిర్ణయం తీసుకున్నట్టుట్లు చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ తెలిపాడు. కాబట్టి సూర్య స్థానంలో హార్దిక్‌ను సారథిగా ఎంపిక చేస్తారా లేదా అన్నది చర్చనీయాంశం. ఐపీఎల్‌లో కెప్టెన్‌గా అతడికి అనుభవం ఉంది.

**సంజూ శాంసన్**

జట్టులో స్థానం సుస్థిరం చేసుకోలేకపోయిన సంజూ శాంసన్... టీ20 ప్రపంచకప్–2026లో టీమిండియా గెలవడంలో కీలక పాత్ర పోషించి హీరో అయ్యాడు. సూపర్–8 నాకౌట్ మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై 97 పరుగులతో అజేయంగా నిలిచిన ఈ కేరళ వికెట్ బ్యాటర్.. ఇంగ్లండ్‌తో సెమీస్‌లో 89, న్యూజిలాండ్‌తో ఫైనల్లో 89 రన్స్‌తో దుమ్మురేపాడు. ఇక ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్‌కు సుదీర్ఘకాలం కెప్టెన్‌గా పనిచేసిన అనుభవం సంజూకు ఉంది. కేరళ జట్టుకు కూడా గతంలో అతడు సారథ్యం వహించాడు.

**అక్షర్ పటేల్**

టీ20 వరల్డ్‌కప్–2026లో టీమిండియా వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున సారథిగానూ అతడు సత్తా చాటుతున్నాడు. సూర్య వారసుడిగా అక్షర్ ఎంపికయ్యే అవకాశాలు లేకపోలేదు.


**శ్రేయస్ అయ్యర్**

ముంబై సారథిగా, ఐపీఎల్‌లో వివిధ జట్ల కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్‌కు అపార అనుభవం ఉంది. 2024లో అతడి సారథ్యంలోనే కోల్‌కతా నైట్ రైడర్స్ టైటిల్ గెలిచింది. గతేడాది పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా, బ్యాటర్‌గా ఇరగదీసి ఫైనల్‌కు చేర్చాడు. అయితే, 2023 డిసెంబరు తర్వాత ఇంత వరకు అతడు భారత టీ20 జట్టు తరఫున ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ప్రస్తుత ఫామ్ దృష్ట్యా త్వరలోనే జట్టులోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది.



# కారా డైరెక్టర్ షాకింగ్ కామెంట్స్

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కారా'. విఘ్నేష్ రాజా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలో ధనుష్ 'కరసామి' అనే పత్తి రైతు పాత్రలో కనిపించబోతున్నారు. ఇందులో ధనుష్ సరసన 'ప్రేమలు' బ్యూటీ మమిత బైజు హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన ప్రతీ అప్డేట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకోగా.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న డైరెక్టర్ మరిన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. 'నీ దగ్గర ఏదైనా ఆసక్తికరమైన కథ ఉంది, నాకు వినిపించాలనుకుంటే.. నేను వినడానికి సిద్ధంగా ఉన్నాను. ఒకవేళ నువ్వు నాతో కలిసి పనిచేయాలనుకుంటే, మనం ఒప్పందం కుదుర్చుకుని వెంటనే నిర్మాణాన్ని ప్రారంభిద్దాం అని ధనుష్ ఒకసారి నాతో అన్నారు. తర్వాత 2024లో ఈ సినిమా కథ నేను ఆయనకు వినిపించాను. మేము 2025లోనే చిత్రీకరణ స్టార్ట్ చేసినప్పటికీ కథా రచన (స్క్రిప్ట్) కోసం మాత్రం చాలా సమయం తీసుకున్నాము. దాదాపు 9 నెలల సమయం పట్టింది. అంతే కాకుండా స్క్రిప్ట్ పని పూర్తిగా కంప్లీట్ అయ్యేవరకు అగ్రిమెంట్ చేసుకోకూడదు అని ముందుగానే మేము నిర్ణయించుకున్నాము. ఎందుకంటే ఈ రోజుల్లో, ప్రేక్షకులను మెప్పించడానికి కేవలం ఒక మంచి సినిమా తీస్తే సరిపోదు. మనం వారి అంచనాలను మించిపోయేలా రాణించాల్సి ఉంటుంది.. పూర్తిగా ఈ కథ పనులు పూర్తయ్యాకే దీనిపై అగ్రిమెంట్ చేసుకున్నాము' అని చెప్పుకొచ్చారు.




# శ్రీనివాస మంగాపురం టీజర్ అప్‌డేట్

సూపర్ స్టార్ కృష్ణ ఫ్యామిలీ నుంచి మూడో తరంగా ఇండస్ట్రీ ఎంట్రీకి సిద్ధం అయ్యాడు దివంగత రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని. 'శ్రీనివాస మంగాపురం' అనే క్రేజీ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి లేటెస్ట్‌గా సాలిడ్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఇందులో నుంచి టీజర్ రాబోతుందని తెలుపుతూ.. 'నిష్కల్మషత్వంలో పాతుకుపోయిన రెండు హృదయాలు.. తీవ్రతతో నిండిన ఒక గాథ.. శ్రీనివాస మంగాపురం టీజర్ రేపు సాయంత్రం 6 గంటలకు విడుదల కాబోతున్నది.. ఆ ప్రపంచం ఆవిష్కృతమవడాన్ని వీక్షించడానికి సిద్ధంగా ఉండండి' అంటూ ఓ క్యూట్ పోస్టర్‌ను షేర్ చేశారు. ప్రజెంట్ ఈ పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. కాగా.. 'ఖీచీ 100', 'మంగళవారం' వంటి సెన్సేషనల్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న కల్ట్ డైరెక్టర్ అజయ్ భూపతి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. చందమామ కథలు వంటి వైవిధ్యమైన చిత్రాలను నిర్మించిన బ్యానర్‌పై ప్రఖ్యాత నిర్మాత అశ్వనీదత్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు.?ఈ సినిమా ద్వారా బాలీవుడ్ బ్యూటీ రవీనా టాండన్ కూతురు రాషా తడాని టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన ప్రతీ అప్డేట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

# యాక్షన్ డ్రామాతో రాబోతున్న రాశీ ఖన్నా

యంగ్ హీరోయిన్ రాశీ ఖన్నా తన కెరీర్‌లో ఒక గట్టి హిట్ కోసం ఎదురుచూస్తోంది. వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఆమెకు అదృష్టం అంతగా కలిసి రావడం లేదు. చివరగా హిందీలో 'ది సబర్మతి రిపోర్ట్' చిత్రంతో హిట్ కొట్టి ఈ భామకు.. తెలుగులో భారీ అంచనాల మధ్య వచ్చిన తెలుసు కదా, ఉస్తాద్ భగత్ సింగ్ వంటి చిత్రాలు ప్రేక్షకులను పూర్తిస్థాయిలో మెప్పించలేకపోవడంతో, ఇప్పుడు ఆమె తన ఆశలన్నీ ఓటీటీపైనే పెట్టుకుంది. రాశీ ఖన్నా తన తదుపరి ప్రాజెక్ట్‌ను ఒక విభిన్నమైన మ్యూజికల్ యాక్షన్ డ్రామాగా ఎంచుకుంది. 'లుఖ్కే' అనే టైటిల్‌తో రాబోతున్న ఈ క్రేజీ సిరీస్‌లో పాపులర్ ర్యాపర్ కింగ్ హీరోగా పరిచయం అవుతున్నారు. హిమాంక్ గౌర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సిరీస్‌లో పాలక్ తివారి, శివాంకిత్, లక్ష్య వీర్ శరణ్ ముఖ్య పాత్రలో కనిపించబోతున్నారు. పంజాబ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ కథలో రాశీ ఖన్నా లుక్ పర్ఫార్మెన్స్ చాలా కొత్తగా ఉండబోతున్నాయని సమాచారం. పంజాబ్‌లోని ర్యాప్ మ్యూజిక్ కల్చర్, దాని వెనుక ఉన్న డ్రగ్ సిండికేట్, పగ – ప్రతీకారాల నేపథ్యంలో ఈ సిరీస్ సాగుతుంది. సంగీత ప్రపంచంలోని చీకటి కోణాలను చూపిస్తూనే, పక్కా యాక్షన్ ఎలిమెంట్స్‌తో దీన్ని రూపొందించారట మేకర్స్. సినిమాల్లో ఆశించిన సక్సెస్ రాకపోయినా, ఈ డిజిటల్ సిరీస్ ద్వారా తన సత్తా చాటాలని రాశీ ఖన్నా గట్టి పట్టుదలతో ఉంది. ఇక ఈ భారీ వెబ్ సిరీస్ డైరెక్ట్ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్‌లో మే 8 నుంచి స్ట్రీమింగ్ కానుంది. కింగ్ మార్క్ మ్యూజిక్, రాశీ ఖన్నా గ్లామర్, యాక్షన్ కలగలిసిన ఈ సిరీస్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని మేకర్స్ నమ్ముతున్నారు. వరుస ఫ్లాపులతో సతమతమవుతున్న రాశీ ఖన్నాకు 'లుఖ్కే' అయినా మంచి హిట్ ఇస్తుందని ఆమె అభిమానులు ఎదురుచూస్తున్నారు.

# రుక్మిణి ప్లేస్‌లో మరో యంగ్ క్రేజియస్ట్ బ్యూటీ!



విభిన్న కథలతో కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లో కూడా తనకంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుని ప్రస్తుతం స్టార్ హీరోగా దూసుకుపోతున్నాడు ధనుష్. ఆయన గ్యాప్ ఇవ్వకుండా బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్టులు అనౌన్స్ చేస్తూ బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టిస్తున్నాడు. అలాగే ప్రస్తుతం ఈ హీరో తన 56వ చిత్రంపై కూడా ఫోకస్ పెట్టినట్లు టాక్. తమిళ దర్శకుడు తమిళరసన్ పచ్చముత్తు ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నాడని తెలుస్తుండగా.. ఇందులో ఫీ మేల్ లీడ్ కోసం రుక్మిణి వసంత్‌ను ఓకే చేసినట్లు టాక్ వచ్చిన విషయం తెలిసిందే. 'కాంతార', 'ఏస్', 'మదరాసి' వంటి చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ రుక్మిణి వసంత్ ప్రస్తుతం చేతులో వరుస ప్రాజెక్టులు పెట్టుకుని బిజీ అయిపోయింది. ఈ క్రమంలోనే ధనుష్ 56వ చిత్రానికి గాను డేట్ సమస్యల కారణంగా ఈ మూవీ నుంచి రుక్మిణిని తప్పించినట్లు టాక్. అలాగే ధనుష్ సరసన హీరోయిన్‌గా సారా అర్జున్‌ను లైన్‌లో పెట్టారట మేకర్స్. టాక్స్ ఫైనల్ అయితే.. దీనిపై త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ అవకాశం ఉన్నట్లు కోలీవుడ్ వర్గాల నుంచి సమాచారం.



# ప్లీజ్ ఒక్క చాన్స్ ఇవ్వండి!



తెలుగులో మెంటల్ మదిలో, చిత్రలహరి వంటి సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నివేదా పేతురాజ్ ఇప్పుడు మళ్లీ వార్తల్లో నిలిచింది. ఒకప్పుడు వరుస అవకాశాలతో బిజీగా ఉన్న ఈ నటి, తన వ్యక్తిగత కారణాల వల్ల సినిమాలకు కాస్త విరామం ఇచ్చింది. అయితే, ఇప్పుడు ఆమె మళ్లీ సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నివేదా తన కెరీర్ జోరుగా సాగుతున్న సమయంలోనే బిజినెస్ మెన్ రజిత్ ఇబ్రాన్‌తో ప్రేమలో పడింది. అతనితో జీవితాన్ని పంచుకోవాలని నిర్ణయించుకున్న ఆమె, 2023లో సినిమాలకు దూరం అయింది. అంతేకాకుండా తన ప్రియుడితో క్లోజ్‌గా దిగిన ఫొటోలను షేర్ చేస్తూ.. కాబోయే భర్తను పరిచయం చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇక పెళ్లి బంధంతో ఒక్కటికాబోతున్నట్లు కూడా హింట్ ఇచ్చేసింది. దీంతో అంతా పెళ్లి చేసుకుని సెటిల్ అయిపోతుందని భావించారు. ఈక్రమంలోనే.. విధి వైపరీత్యం వల్ల వీరిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోయారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుండి ప్రియుడితో ఉన్న ఫోటోలన్నీ తొలగించి బ్రేకప్‌పై అందరికీ హింట్ ఇచ్చేసింది. తాజాగా రజిత్ మరో అమ్మాయితో నిశ్చితార్థం చేసుకోవడంతో, నివేదా తన గతాన్ని వదిలేసి మళ్లీ కెరీర్ మీద దృష్టి పెట్టిందట. ప్రస్తుతం నివేదా మళ్లీ వెండితెరపై మెరవాలని ఆరాటపడుతోంది. ఇందులో భాగంగా ఆమె టాలీవుడ్‌లోని పాత మేకర్స్‌ను, దర్శకులను సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది.

Editor, Publisher & Owner by Reddy Shekar, 3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463